
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
శనివారం, 22 ఫిబ్రవరి 2025

తుది దశకు రాజీవ్ ట్రోఫీ క్రికెట్ పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో జరుగుతున్న రాజీవ్ ట్రోఫి ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు తుది దశకు చేరుకున్నాయి. గత ఆరు రోజుల పాటు జరిగిన లీగ్ పోటీల్లో అత్యధిక మ్యాచ్‌లలో విజయం సాధించిన ఖమ్మం అర్బన్, నేలకొండపల్లి, కల్లూరు, మణుగూరు జట్లు సెమీ ఫైనల్స్‌కు చేరుకున్నాయి. ఆయా జట్లకు శనివారం సెమీస్ పోటీలను నిర్వహించనున్నారు. కార్యక్రమంలో టోర్నీ నిర్వాహకుడు మతిన్, సీనియర్ క్రీడాకారులు తదితరులు ఉన్నారు.

ఆయిల్‌ఫెడ్ డివిజనల్
అధికారిపై వేటు

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి డివిజన్ ఆయిల్‌ఫెడ్ అధికారి బాలకృష్ణను సస్పెండ్ చేస్తూ ఆయిల్‌ఫెడ్ ఎండీ యాస్మిన్‌బాషా శుక్రవారం ఉత్తర్వులు పంపించారు. సత్తుపల్లి మండలం రేగళ్లపాడు నర్సరీలో 80వేల మొక్కలు అనుమతి లేకుండా ధ్వంసం చేశారనే ఆరోపణలపై సస్పెన్షన్ వేటు పడినట్టు తెలిసింది. ఈనెల 9,10వ తేదీలలో ఉద్యానవన శాఖ అధికారులు విచారణ నిర్వహించి నివేదికను అందించిన మీదట వేటు పడ్డట్టు సమాచారం. గతంలోనే నర్సరీ సూపర్‌వైజర్లు పృథ్వీలాల్, కృష్ణారావులను విధుల నుంచి తొలగించిన విషయం తెలిసిందే.

ఏరులో కోళ్ల
కళేబరాలు

పైనంపల్లి గ్రామస్థుల ఆందోళన



నేలకొండపల్లి, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలోని నేలకొండపల్లి మండల పరిధిలోని పైనంపల్లి వద్ద పాలేరు ఏరులో కోళ్ల కళేబరాలు కొట్టుకువచ్చాయి. ఈ సంఘటన గ్రామంలో కలకలం రేపింది. శుక్రవారం పొలాలకు వెళ్లిన రైతులకు ఏరు నీటి ప్రవాహానికి కొట్టుకుపోతున్న కోళ్లు కనిపించటంతో బెంబేలెత్తారు. బర్డ్‌ఫ్లూతో కోళ్ల మృత్యువాత పడుతున్న తరుణంలో పాలేరు ఏరులో కోళ్ల కళేబరాలు కనిపించడం ఆందోళనకు గురిచేసింది. పైనంపల్లిలో ఎక్కడా కోళ్లఫారాలు లేవు. అయినా ఏరులోకి వచ్చిన కోళ్లు ఎలా వచ్చాయి.. ఎవరు వేశారు.. అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఏరుపైనున్న గ్రామాల్లో పౌల్ట్రీ ఫామ్‌లున్న వాళ్ల చచ్చిన కోళ్లను ఏరులో పారేసి ఉంటారని, అవే కొట్టుకొచ్చి ఉంటాయని భావిస్తున్నారు.



పట్టు వదలని అక్రమార్కులు

ఏసీబీ వేటాడుతున్నా బెదరని లంచగొండులు

ఒకవైపు అక్రమార్కులపై నిఘా పెట్టి, వదిలేదే లేదు అన్నట్టుగా ఏసీబీ వెంటాడుతున్నా... మరోవైపు అక్రమార్కులను పట్టుకుని కేసులు పెట్టి జైలుకు పంపుతున్నా... ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగుల చేతివాటాలు ఆగడం లేదు. ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ అవినీతికి పాల్పడుతూ అక్రమార్జన సాగిస్తున్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించి ముడుపులు లేనిదే ఫైలు ముట్టుకోలేని పరిస్థితులు నెలకొన్నాయి. గతేడాది కాలంగా ఉమ్మడి జిల్లాలో అనేకమంది అక్రమార్కులు ఏసీబీకి చిక్కి జైలు పాలయ్యారు. అయినా అధికారులు, ఉద్యోగుల తీరు మారడంలేదు. కలెక్టర్లు మంత్రులు, ప్రతి సమావేశంలో కిందిస్థాయి ఉద్యోగులు, అధికారులు నిజాయితీగా పని చేయాలని ప్రజల మన్ననలు పొందాలని, ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని హెచ్చరిస్తున్నా... క్షేత్రస్థాయిలో అధికారగణం తమకేమీ పట్టనట్టుగానే వ్యవహరిస్తున్నారు. ప్రతి పనికి ఒక రేటు చొప్పున వసూలు చేస్తున్నారు.

- ఉమ్మడి జిల్లాలో గత 14 నెలల్లో 14 కేసుల నమోదు
- ప్రతీ పనికి రేటు విధించి మరీ వసూళ్లు
- ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో విచ్చలవిడిగా అవినీతి
- కిందిస్థాయి నుంచి పైస్థాయి దాకా చేతివాటం
- అన్ని శాఖల్లోనూ అందినకాడికి దండుకునే సంస్కృతి
- బజారున పడుతున్న ప్రభుత్వ శాఖల గౌరవం
- లంచం వేధింపులను భరించలేక ఏసీబీని ఆశ్రయిస్తున్న బాధితులు
- తాజాగా ఏసీబీకి చిక్కిన ఏవో

ఖమ్మం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం ఉమ్మడి జిల్లాలో ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ప్రజాపాలనలో దరఖాస్తులు స్వీకరించి ఇటీవల పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించారు. ఖమ్మం జిల్లా పరిధిలో గతంలో 3,42,803 మంది రైతులు 7,40,615 ఎకరాల్లో రైతుబంధు అందుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 1,85,014 మంది రైతులు 5,09,966 ఎకరాల్లో రైతుబంధు అందుకున్నారు.

దీనిని క్షేత్రస్థాయిలో ఏవోలు, ఏఈవోలు ఇటీవల సర్వే నిర్వహించారు. పట్టాలుండి సాగుభూములు లేని చోట రియల్ వెంచర్లు, గుట్టలు, కొండలు గుర్తించమని సర్వే బాధ్యతలు అప్పచెప్పగా, కిందిస్థాయిలో సాగులేని భూములను సాగులో ఉన్నట్టుగా చూపించిన ఘటనలున్నాయి. కొంతమంది పలుకుబడి ఉన్న నాయకులు ఇందిరమ్మ కమిటీల ద్వారా సర్వేలో లెక్క తప్పకుండా చూసుకోగలిగారు. చిన్న, సన్నకారు రైతుల భూములు సర్వేలో గుర్తించారు. పెద్ద రైతులు పలుకుబడి ఉన్న రైతుల భూముల విషయంలో లెక్క తేల్చలేదని ఫిర్యాదులున్నాయి. ఇందుకోసం క్షేత్రస్థాయిలో సిబ్బంది చేతివాటం ప్రదర్శించారు. రేషన్‌కార్డుల (మిగతా 6వ పేజీలో)

ఏసీబీ కేసులు పెడుతున్నా...

జిల్లాలో గతేడాది నుంచి ఇప్పటివరకు ఏసీబీ అధికారులు ఫిర్యాదు వస్తే వెంటనే స్పందించి కేసులు పెట్టి అరెస్టు చేస్తున్నారు. రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుంటున్నారు. అయినా అధికారులు, ఉద్యోగులు ముడుపులు చూడకుండా ఫైలు ముట్టలేని స్థితిలో ఉన్నారు. గురువారం రైతు పత్తి అమ్మేందుకు కూపన్ కోసం రూ.30వేలు తీసుకుని అశ్వాపురం వ్యవసాయాధికారి శంతన్‌కుమార్ పట్టుబడడం అంతకుముందు కొమరారంలో ఇద్దరు అటవీశాఖ అధికారులు గంటేల ఉదయ్‌కుమార్, సునావత్ హరిలాల్‌లు రూ.30వేలు లంచం తీసుకుంటూ పట్టుబట్టడం చర్చనీయాంశంగా మారింది. సత్తుపల్లి మునిసిపల్ వార్డు అధికారి వినోద్ తెల్లరేషన్‌కార్డు మంజూరు విషయంలో రూ.2500 లంచం తీసుకుని పట్టుబడగా ఈ నెలలోనే ఇల్లెందులో ప్రభుత్వ పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణ కాంట్రాక్టు ఉద్యోగి వద్ద రూ.2వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు.



ఖమ్మంలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం

కార్పొరేట్ శక్తులకు
పాలకుల వత్తాసు

- ప్రజలకు ఇస్తే ఉచితాలు.. కార్పొరేట్లకు ఇస్తే ప్రోత్సాహకాలా?
- కార్మికులు, కర్షకుల పట్ల మారని ప్రభుత్వాల తీరు
- దుర్భర పరిస్థితుల్లో హమాలీ కుటుంబాలు
- టీయూసీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం
- నగరంలో హమాలీల సంఘం రాష్ట్ర 4వ మహాసభలు

ఖమ్మం సంక్షేమవిభాగం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ శక్తులు కంపెనీలు ఏర్పాటు చేసుకునేందుకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.లక్షల కోట్లు అందిస్తూ వాటికి ప్రోత్సాహకాలు అని పేరు పెట్టి వత్తాసు పలుకుతున్నాయని తెలంగాణ ప్రగతిశీల కార్మిక సంఘం (టీయూసీఐ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం, హమాలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాసరావు విమర్శించారు. ఖమ్మం జిల్లా కేంద్రంలో టీయూసీఐ అనుబంధ హమాలీల సంఘం రాష్ట్ర 4వ మహాసభలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో హమాలీ కార్మికుల నడుమ జెండావిష్కరణ చేశారు. అనంతరం ఖమ్మంలో ర్యాలీ నిర్వహించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సి.వెంకటేష్ అధ్యక్షతన బహిరంగ సభను నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయా సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు సూర్యం, శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో 3లక్షల మంది హమాలీ కార్మికులు రాత్రింబవళ్లు చెమటోర్చి పని చేస్తున్నారన్నారు. హమాలీ, మిల్ కార్మికులకు ప్రభుత్వాల నుంచి కనీస గుర్తింపు ఉండటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైస్ మిల్లుల నుంచి గ్రానైట్, మార్బుల్ వ్యాపారం వరకు హమాలీల కాయకష్టంపైనే ఆధారపడిందన్నారు. అభివృద్ధి, రవాణాలో కీలకంగా పని చేస్తున్నా హమాలీలకు ఎటువంటి రక్షణ కార్మిక చట్టాలను ప్రభుత్వాలు ఏర్పాటు చేయలేదని ఆరోపించారు. చట్టబద్ధమైన హక్కులు లేక పోవటంతో (మిగతా 6వ పేజీలో)

నేటి నుంచి కోల్ ఇండియా
అథ్లెటిక్స్ పోటీలు

- కొత్తగూడెం ప్రకాశం గ్రౌండ్‌లో భారీ ఏర్పాట్లు
- హాజరుకానున్న 9 బొగ్గు కంపెనీల క్రీడాకారులు
- పర్యవేక్షించిన జీఎం (పర్సనల్) కవితానాయుడు

6

నాణ్యమైన విద్యను అందించాలి

బీసీ సంక్షేమ శాఖ జాయింట్ సెక్రటరీ మద్దిలేటి

కొణిజర్ల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పౌష్టిక ఆహారం, నాణ్యమైన విద్యను అందించాలని బీసీ సంక్షేమశాఖ జాయింట్ సెక్రటరీ మద్దిలేటి సూచించారు. శుక్రవారం మండలంలోని అమ్మపాలెం పంచాయతీ పరిధిలో తనికెళ్ల సమీపంలో నిర్వహిస్తున్న మహాత్మ జ్యోతిబా పూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలను సాయంత్రం సమయంలో సందర్శించారు. విద్యార్థులకు భోజనం సమయం కావడంతో విద్యార్థులకు పెట్టే భోజనాన్ని, కిచెన్‌రూమ్, డైనింగ్ హాల్, స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఖమ్మం ఆర్‌సీవో రాంబాబు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పద్మజ ఉన్నారు.

కస్తూర్బా పాఠశాల ఆకస్మిక తనిఖీ

పెనుబల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సమాజం పట్ల విద్యార్థినులు అవగాహన కలిగి ఉండాలని అదనపు కలెక్టర్ శ్రీజ అన్నారు. శుక్రవారం ఆమె పెనుబల్లి మండలంలోని ఉప్పలచెలక కస్తూర్బా పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు సమాజం పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తేవాలన్నారు. పాఠశాలలో ఖాళీగా ఉన్న సోషల్ టీచర్ పోస్టును వెంటనే భర్తీ చేయాలని ప్రిన్సిపాల్ వెంకటరమణను ఆదేశించారు. పాఠశాల ప్రాంగణం ముందు ప్రవేశ గేటును, ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్‌ను మరమ్మతులు చేయించాలని ఎంపీడీవో అన్నపూర్ణకు ఆదేశించారు. కార్యక్రమంలో మండల పరిధిలో గల పలువురు అధికారులు పాల్గొన్నారు.

మహా శివరాత్రికి
75 ప్రత్యేక బస్సులు

ఖమ్మం ఖానాపురం హవేలి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తుల సౌకర్యార్థం ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని డిపోల నుంచి శైవ క్షేత్రాలకు 75 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు రీజనల్ మేనేజర్ సరిరాం తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని తీర్థాల, స్నానాలలక్ష్మీపురం, నీలాద్రి, అన్నపురెడ్డిపల్లి, మోతేగడ్డ, బెండాలపాడు శివాలయాలకు (మిగతా 6వ పేజీలో)



ఆర్టీసీ ఆర్‌ఎం సరిరాం

ప్రధాని దృష్టికి కిష్టారం సమస్య

- సైలో బంకర్‌ను తొలగించాలి..
- లేకుంటే పునరావాసం కల్పించాలి
- నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేస్తాం
- బీజేపీ జాతీయ నాయకుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి

6



కిష్టారంలో గ్రామస్థుల శిబిరంలో ప్రసంగిస్తున్న పొంగులేటి సుధాకర్‌రెడ్డి

మంచినీటి ఎద్దడిపై
ముందస్తు యుద్ధం



నీటి వనరులను పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

- తాగునీటి బావులు, బోర్లు, చేతి పంపులు, మిషన్ భగీరథ పైపులపై దృష్టి
- అవసరమైన చోట్ల సత్వరమే మరమ్మతులు
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో అధికారులు
- టోల్‌ఫ్రీ నెంబర్ 1800 599 4007 ఏర్పాటు

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగు నీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా అధికారులు ముందస్తు కార్యాచరణ చేపట్టారు. ప్రతి గ్రామానికి వెళ్లి తాగునీటి బావులు, బోర్లు, చేతి పంపులు, మిషన్ భగీరథ పైపులను పరిశీలించి సమస్యలను గుర్తించారు. వేసవి ప్రారంభానికి ముందుగానే మరమ్మతులు చేపట్టి ఇబ్బందులు తొలగించడానికి సిద్ధమవుతున్నారు. గ్రామాల్లో మిషన్ భగీరథ నీటితోపాటు చేతి పంపులు, మంచి నీటి బావులు, సింగిల్, త్రీ ఫేజ్ మోటార్లతో నీటి సరఫరా జరుగుతోంది. మిషన్ భగీరథ ద్వారా ప్రతీ ఒక్కరికి వంద లీటర్ల నీటిని సరఫరా చేయాలనే లక్ష్యంతో కార్యాచరణ చేపట్టారు.

గ్రామాల్లో నీటి సరఫరాలో ఎదురవుతున్న అవాంతరాలను తెలుసుకునే విధంగా గ్రామాల్లో ఎంపీవోలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఇంట్రా, గ్రిడ్ ఏఈలు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పంపు ఆపరేటర్లు, స్థానికులతో మాట్లాడి నీటి సరఫరా స్థాయిలో పర్యటించారు. మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడితే ప్రత్యామ్నాయంగా నీరు అందించే విధంగా సిద్ధం అవుతున్నారు. ఏప్రిల్, మే నెల వరకు ఏ గ్రామాల్లోనైనా తీవ్ర నీటి ఎద్దడి తలెత్తితే బావులు, మోటార్ల ద్వారా నీటిని అందించడంతోపాటు అవసరమైతే వ్యవసాయ బావులు అద్దెకు తీసుకోవాలని నిర్ణయించారు.

ప్రాధాన్య అంశాలు..

నిరుపయోగంగా ఉన్న చేతి పంపులు గుర్తించి వాటికి మరమ్మతు చేయించి వినియోగంలోకి తీసుకురావడం, నీటి నాణ్యత పరీక్షలు, క్లోరినేషన్ చేయించడం. సింగిల్, త్రీఫేజ్ మోటారు పనితీరు, స్టార్టర్ ఫ్యూజు (మిగతా 6వ పేజీలో)

DCCB Khammam
జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ లిమిటెడ్, ఖమ్మం.
ప్రధాన కార్యాలయం, గాంధీచౌక్, ఖమ్మం.

బహిరంగ వేలము ప్రకటన

ఇ.పి.నెం.87/2018-2019

శ్రీమతి మలిశెట్టి అనురాధ (ఋణగ్రహీత), భర్త : గిరిరావు, శ్రీనివాస్ నగర్, ఖమ్మం అర్బన్, ఖమ్మం వీరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్, ప్రధాన కార్యాలయం నందు ఋణము తీసుకొని సకాలంలో చెల్లింపక వాయిదా మీరి ఉన్నారు. అట్టి ఋణముల వసూలు నిమిత్తం వారికి సంబంధించిన ఆస్తి ఖమ్మం రెవిన్యూ గ్రామంలో ఈ క్రింద చూపబడిన ఆస్తిని బహిరంగ వేలము ద్వారా విక్రయించి బకాయిలను రాబట్టుకొనుటకు ది.01-03-2025 వ తేదీన ఉదయం 11.45 గంటలకు, జిల్లా కేంద్ర సహకార బ్యాంక్, ప్రధాన కార్యాలయం, ఖమ్మం నందు బహిరంగ వేలము నిర్వహించబడును. కనుక ఆసక్తి గల వ్యక్తులు వేలములో పాల్గొని ఈ క్రింద తెలుపబడిన షరతులకు లోబడి కొనుగోలు చేసుకొనవచ్చును.

వేలము వేయు స్థిరాస్తి యొక్క వివరములు

బకాయిదారుడు / హామీదారుడు	స్థిరాస్తి	విస్తీర్ణం	హద్దులు	రెవిన్యూ గ్రామం	రెవిన్యూ మండలం
శ్రీమతి మలిశెట్టి అనురాధ (బకాయిదారులు) భర్త : గిరిరావు	ఇ.నెం. 4-8-81ఎ (పాతది) 3-8-262/2/3 (కొత్తది)	241.43 చ॥గ॥లు	తూర్పు : మున్సిపల్ రోడ్డు; పడమర : పంగలేటి రాఘవమ్మ గారి ఖాళీ స్థలం, మధ్యలో పొత్తుగోడ; ఉత్తరం : మలిశెట్టి విజయ్‌కుమార్ గారి ఇల్లు మరియు పొత్తు గోడ; దక్షిణం : చెరుకూరి భాస్కర్‌రావు గారి ఇల్లు మరియు పొత్తు గోడ	ఖమ్మం	ఖమ్మం అర్బన్

వేలము షరతులు : 1) వేలములో పాల్గొను పాటదారుడు రూ. 15000/- ధరావతు (ఈఎమ్‌డి-డి.డి) వేలమునకు ముందు సేల్ ఆఫీసర్‌కు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చును. 2) అత్యధిక పాటదారుడు పాటపాడిన మొత్తంలో 15% సొమ్ము వెంటనే చెల్లించవలెను. అట్లు చెల్లించని యెడల సదరు భూమిని తిరిగి వెంటనే వేలము వేయబడును. 3) మిగిలిన 85% సొమ్మును మరియు రిజిస్ట్రేషన్ కొరకు స్టాంపు డ్యూటీ విలువ వేలం తేదీ నుండి 15 రోజులలోపు చెల్లించవలెను. అట్లు చెల్లించని యెడల ముందు చెల్లించిన 15% సొమ్మును నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఖాతాకు జమచేసి తిరిగి వేలం వేయబడును. 4) వేలం పాటలో పాల్గొనువారు సదరు గ్రామంలో గల భూములను సర్వే నెంబర్ ప్రకారం తనిఖీ చేసుకొనవచ్చును. 5) వేలంలో సరైన ధర వచ్చినప్పుడు మాత్రమే పాటను ఖరారు చేయబడును. 6) వేలంలో సరియైన ధర రాకపోయిననూ మరియు ఏ కారణములు చూపకుండా వేలం నిలిపివేయుట లేదా వాయిదా వేయుటకు సేల్ ఆఫీసర్ గారికి పూర్తి అధికారములు కలవు. 7) వేలంలో సరైన ధర రాకపోయినా, వేలంలో ఎవ్వరూ పాటదారులు పాల్గొనకపోయినా, షెడ్యూల్డ్ కులముల వారికి ప్రభుత్వం వారిచే 3 ఎకరాల భూమి పథకం క్రింద ప్రభుత్వ నిబంధనలు, ధరలకు అనుగుణంగా భూమిని అమ్మి ఋణఖాతాకు సొమ్ము జమచేయబడును లేదా ప్రభుత్వ ధరలకు అనుగుణంగా భూమిని బ్యాంకు వారికి స్వాధీనం చేయబడును. 8) పైన తెలుపబడిన భూములను ఏకమొత్తంలో గాని లేక సర్వే నెంబర్ల ప్రకారం విడివిడిగా గానీ వేలం వేయు అధికారం కలదు. 9) భూముల వివరములు ఇచ్చుటలో గానీ, వైశాల్యము వివరములు అంచనా వేయుటలో కలుగు తప్పులకు బ్యాంకు వారు బాధ్యులు కారని స్పష్టంగా తెలుసుకొనవలెను. 10) ఇతర వివరములకు డిప్యూటీ రిజిస్ట్రార్ / ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ గారిని సంప్రదించవచ్చును.

ఇతర వివరముల కొరకు : 9908875355, 7993448888 నెంబర్లను సంప్రదించగలరు.

తేది : 21-02-2025
స్థలం : ఖమ్మం

సం/- సేల్ ఆఫీసర్, జిల్లా కేంద్ర సహకార బ్యాంక్, ప్రధాన కార్యాలయం, ఖమ్మం.

ఆంధ్రజ్యోతి



కార్ అండ్ బైక్ రేస్

ఫిబ్రవరి నెల కూపన్ నంబర్ - 2

పాఠకుని పూర్తి పేరు	:	....
డోర్ నెంబరు	:	....
వీధి పేరు	:	....
గ్రామం / పట్టణం	:	....
మండలం	:	....
జిల్లా	:	....
పోస్టల్ పిన్‌కోడ్	:	....
ఫోన్ నంబర్	:	....

నాలుగు నెలల్లో ఆంధ్రజ్యోతి డ్రాలో ఇది ఫిబ్రవరి నెల రెండవ కూపన్ ఈ కూపన్‌లో మీ అడ్రస్ పూర్తి చేసి ఈ నెలలో ఇచ్చే మూడు కూపన్లను ఒక సెట్‌గా చేసి 2025 మార్చ్ నెల 10వ తేది నాటికి ఈ క్రింది అడ్రస్‌కు పోస్ట్ ద్వారా కాని, స్వయంగా కాని అందచేయవలెను.



నోట్ : సెట్‌గా కాకుండా విడిగా పంపిన కూపన్లు చెల్లవు.

* చట్ట ప్రకారం నిబంధనలు వర్తించును.

కూపన్లు పంపవలసిన చిరునామా

సర్క్యులేషన్ మేనేజర్, ఆంధ్రజ్యోతి కార్యాలయం
IDA ప్లాట్ నెం-112. శ్రీ అభయవేంకటేశ్వరస్వామి టెంపుల్ రోడ్
ఇండస్ట్రియల్ ఏరియా, ఖానాపురంహవేలి, ఖమ్మం. పిన్‌కోడ్ - 507002
సర్క్యులేషన్ మేనేజర్ : 9985411350
బ్రాంచ్ మేనేజర్ : 9985411345

నేటినుంచి కోల్ ఇండియా
అథ్లెటిక్స్ పోటీలు

- కొత్తగూడెం ప్రకాశంగ్రౌండ్‌లో భారీ ఏర్పాట్లు
- హాజరుకానున్న 9 బొగ్గు కంపెనీల క్రీడాకారులు
- పర్యవేక్షించిన జీఎం (పర్సనల్) కవితానాయుడు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కవితానాయుడు

రుద్రంపూర్ (సింగరేణి) ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కోల్ ఇండియా అథ్లెటిక్స్ పోటీలు శనివారం సింగరేణి ప్రకాశంస్టేడియం గ్రౌండ్‌లో ప్రారంభం కానున్నాయి. దేశంలోనే 9 బొగ్గు కంపెనీలకు సంబంధించిన క్రీడాకారులు హాజరుకానున్నారు. క్రీడాప్రాంగణాన్ని సింగరేణి అధికారులు ముస్తాబు చేశారు. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సింగరేణి జనరల్ మేనేజరు (పర్సనల్) కవితానాయుడు ఆదేశించారు. శుక్రవారం ప్రకాశంస్టేడియం గ్రౌండ్‌ను పరిశీలించారు. దేశవ్యాప్తంగా 9 బొగ్గు పరిశ్రమలకు చెందిన మొత్తం 284 మంది క్రీడాకారులు ఈ పోటీలో తలపడనున్నారు. 107మంది మహిళా క్రీడాకారులు కాగా.. 177మంది పురుష క్రీడాకారులు హాజరుకానున్నారు. 8విభాగాలకు సంబంధించిన మహిళ, పురుష క్రీడాకారులకు అథ్లెటిక్స్‌లను నిర్వహించనున్నారు. ఇందుకోసం సింగరేణి యాజమాన్యం రూ. 14లక్షల నిధులను కేటాయించింది. సింగరేణిలోని సివిల్, పర్సనల్, వెల్ఫేర్, వైద్య విభాగాలకు సంబంధించి ప్రత్యేక కమిటీలను ఏర్పాటుచేశారు. పోటీలను సింగరేణి డైరెక్టర్ (ఈఅండ్ఎం) సత్యనారాయణరావు ప్రారంభించనున్నారు. క్రీడాపోటీల ముగింపు కార్యక్రమానికి సింగరేణి సీఎండీ ఎన్.బలరాం హాజరుకానున్నారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎస్పీ రోహిత్‌రాజ్

రెక్కల రామక్కను దర్శించుకున్న ఎస్పీ

ఆళ్లపల్లి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఆళ్లపల్లి మండలం, మర్కోడు పంచాయతీ, పెద్దూరు గ్రామంలో కొమరం వారి ఇలవేల్పు అయిన రెక్కల రామక్క వన దేవుళ్లను శుక్రవారం ఎస్పీ రోహిత్‌రాజ్ దర్శించుకున్నారు. అనంతరం రెక్కలరామక్క చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఎస్పీ జాతరకు విచ్చేసిన సందర్భంగా కొమరం వంశీయులు ఆయనను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఇల్లెందు డీఎస్పీ చంద్రబాను, టేకులపల్లి సీఐ సురేష్ గౌడ్, ఆళ్లపల్లి ఎస్ఐ రతీష్, పోలీస్ సిబ్బంది, కొమరం వంశీయులు, పూజారులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో
ప్రతీ దశలో తోడ్పాటు అందించాలి

శిక్షణా కార్యక్రమంలో అధికారులకు కలెక్టర్ ఆదేశం

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో లబ్ధిదారులకు ప్రతీ దశలో తోడ్పాటు అందించాలని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం (నిర్మాణం)పై ఖమ్మం, పాలేరు, మధిర నియోజకవర్గాల మండల, గ్రామ పంచాయతీస్థాయి అధికారులతో పాటు మండల ప్రత్యేక అధికారులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ప్రజల జీవన విధానంలో మార్పులు తీసుకొని రావచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అర్హులకు ఇళ్లు అందేలా చూడాలన్నారు. గ్రామ సభలో వచ్చిన దరఖాస్తులను ఇందిరమ్మ ఇళ్ల యాప్ ద్వారా మరోసారి పరిశీలన చేయనున్నట్టు కలెక్టర్ వెల్లడించారు.

అనర్హులకు ఇందిరమ్మ ఇల్లు కేటాయించవద్దని, తప్పులు ఏమైనా జరిగితే ముందుగానే గుర్తించాలన్నారు. అనర్హులకు ఇళ్లు మంజూరుచేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. సొంత జాగా ఉండి ఇల్లు లేని వారు, జాగా.. ఇల్లు లేని వారు, ఆర్సీసీ రూఫ్‌తో ఉన్నవారు వివరాలతో ఎల్1, ఎల్2, ఎల్3 లుగా మూడు జాబితాలపై అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. విడతల వారీగా ప్రతి ఒక్కరికి ఇల్లు నిర్మించాలనేదే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ తెలిపారు. పేదలను ఎంపిక చేస్తున్న నేపథ్యంలో ఇంటి నిర్మాణం రూ.5 లక్షలు దాటితే పూర్తి చేయడం లబ్ధిదారులకు కష్టం అవుతుందని, ప్రతి దశలో తక్కువ



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖర్చుతో నాణ్యమైన ఇల్లు ఎలా కట్టాలో సలహాలు, సూచనలు అందజేయాలని, ఇల్లు నాణ్యతగా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఇంటి నిర్మాణం కోసం అవసరమైన ఇసుకను ప్రతి మండల కేంద్రానికి తీసుకుని వచ్చే బాధ్యత జిల్లా యంత్రాంగం తీసుకుంటుందని, మండల కేంద్రం నుంచి లబ్ధిదారులకు అందేలా అధికారులు చూడాలన్నారు. ప్రతి మండల కేంద్రంలో మోడల్ ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తున్నామని, అది ఎలా కడుతున్నారో పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ఈ శిక్షణా సమావేశంలో డీఆర్డీవో సన్యాసయ్య, జడ్పీ సీఈవో దీక్షా రైనా, డీపీవో ఆశాలత, హౌజింగ్ పీడీ శ్రీనివాసరావు, పీఆర్ ఈఈ వెంకట్‌రెడ్డి, మండల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.



స్వర్ణ కవచంలో రామయ్య

భద్రాచలం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి స్వర్ణ కవచంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ప్రతి శుక్రవారం మూలవరులకు స్వర్ణకవచధారణను దేవస్థానం వైదిక సిబ్బంది చేస్తారు. ఈ క్రమంలో శుక్రవారం మూలవరులకు స్వర్ణకవచాన్ని ధరింపజేయడంతో భక్తులు స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇదిలా ఉండగా నిత్యం స్వామివారికి నిర్వహించే నిత్య కళ్యాణం సంప్రదాయబద్ధంగా అర్చక స్వాములు నిర్వహించారు. ముందుగా నిత్య కళ్యాణమండపానికి స్వామివారిని మేళతాళాలతో తీసుకవచ్చి ప్రత్యేక ఆలంకరణ చేశారు. అనంతరం సహస్రనామార్చన నిర్వహించగా క్షేత్ర మహత్యంను వివరించారు. కళ్యాణప్రక్రియలో భాగంగా ముందుగా విశ్వక్సేనార్చన, పుణ్యావచనం, కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, శుభముహూర్త సమాయన జీలకర బెల్లం మిశ్రమాన్ని స్వామివారి అమ్మవారి శిరస్సుపై అర్చక స్వాములు పెట్టారు. ఈ క్రమంలో మాంగల్యధారణ, తలంబ్రాలు, వేదాసీర్వచనం నిర్వహించారు.

ఏసీబీకి చిక్కిన ఏవోకు
రాజకీయ పార్టీల మద్దతు

కుట్రపై విచారణ జరపాలని డిమాండ్

అశ్వాపురం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయాధికారి సాయిశంతన్‌కుమార్‌పై గురువారం ఏసీబీ అధికారులు జరిపిన దాడిలో కుట్రకోణం దాగి ఉందని, వెంటనే ప్రభుత్వం విచారణ జరపాలని మండలంలోని అధికార కాంగ్రెస్‌తోపాటు పలు రాజకీయ పార్టీలు, రైతుసంఘాలు డిమాండ్ చేశాయి. శుక్రవారం ఆయా పార్టీల ఆధ్వర్యంలో పార్టీ సమావేశాలు నిర్వహించి ఏవోకు మద్దతు ప్రకటించాయి. ఏవో మండలంలో కరోనా కష్టకాలంలో, గోదావరి వరదల సమయంలో ప్రజలకు సేవలందించారని, ప్రతి రైతుకు వ్యవసాయశాఖ తరుపున పూర్తిస్థాయిలో సేవలు అందించారని పేర్కొన్నారు. నిజాయితీ గల అధికారిగా జిల్లాస్థాయిలో గుర్తింపు పొందారని గుర్తుచేశారు. అటువంటి అధికారిని కొందరు వ్యక్తులు కుట్రపూరితంగా తమ స్వలాభం పేరుతో ఏసీబీకి పట్టించారని పలు పార్టీలు సమావేశాలతోపాటు, సామాజిక మాధ్యమాల్లో ప్రకటించాయి. తక్షణమే ఏసీబీ దాడిపై విచారణ జరిపించి నిజానిజాలు నిగ్గుతేల్చి ప్రజల ముందు ఉంచాలని వామపక్షపార్టీలు డిమాండ్ చేశాయి.

మహా శివరాత్రికి 75 ప్రత్యేక బస్సులు

(5వ పేజీ తరువాయి)

ఈ బస్సులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. మహిళలకు ఉచిత ప్రయాణం అందుబాటులో ఉంటుందని తెలిపారు. అదనపు చార్జీలతో ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు.

ఖమ్మం డిపో నుంచి తీర్థాలకు 25 ప్రత్యేక బస్సులు టికెట్ ధర పెద్దలకు రూ.30, పిల్లలకు రూ.20, మధిర డిపో నుంచి వైరా లక్ష్మీపురానికి 10 బస్సులు చార్జీ పెద్దలకు రూ.30, పిల్లలకు రూ. 20, సత్తుపల్లి డిపో నుంచి నీలాద్రికి 25 బస్సులు చార్జీ పెద్దలకు రూ.50, పిల్లలకు రూ.30, భద్రాచలం డిపో నుంచి మోతేగడ్డకు 5 బస్సులు చార్జీ పెద్దలకు రూ.30, పిల్లలకు రూ.20, కొత్తగూడెం డిపో నుంచి నీలాద్రి, అన్నపురెడ్డిపల్లి, 10 బస్సులు చార్జీ పెద్దలకు రూ.90, పిల్లలకు రూ.30, నిర్ణయించారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు
పకడ్బందీ ఏర్పాట్లు

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారితో వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, సీపీ

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్టు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్‌రెడ్డి గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలపై ఆయా జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఖమ్మం కలెక్టర్, పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌తో కలిసి పాల్గొన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి, పోలింగ్ సిబ్బంది, బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాల ముద్రణ, పోస్టల్ బ్యాలెట్ జారీ, పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన వసతులు, వెబ్ కాస్టింగ్, డిస్ట్రిబ్యూషన్ రిసెప్షన్ కేంద్రాల వద్ద ఏర్పాటు, పోలీస్ బందోబస్తు, తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి చర్చించి జిల్లా కలెక్టర్లకు పలు సూచనలు చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు 24 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశామన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో సిబ్బందిని నియమించి అవసరమైన శిక్షణ అందించామన్నారు. పోలింగ్ ముగిసిన తరువాత బ్యాలెట్ బాక్స్‌లను నేరుగా నల్గొండ తరలించేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్టు తెలిపారు. ఎన్నికలకు అవసరమైన బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాలు అందుబాటులో ఉన్నాయని, పోలింగ్ కేంద్రాల వద్ద నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు చేపట్టామన్నారు. ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల బందోబస్తుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. ఈ వీడియో సమావేశంలో డీఆర్వో ఏ.పద్మశ్రీ, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు స్వామి, కలెక్టరేట్ ఎన్నికల డీటీ అన్సారీ పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న పిడమర్తి రవి

ఎస్సీ వర్గీకరణకు అడ్డుపడేది
మందకృష్ణ మాదిగనే

తెలంగాణ మాదిగ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిడమర్తి రవి

ఖమ్మం చర్చికాంపౌండ్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు అడ్డుపడేది మందకృష్ణమాదిగ అని తెలంగాణ మాదిగ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిడమర్తి రవి అన్నారు. శుక్రవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తామని ప్రకటించారన్నారు. వర్గీకరణపై శాస్త్రీయబద్ధంగా జస్టిస్ షమీమ్ అక్తర్ కమిషన్ వేసి ఆమోదం చేశారన్నారు. మందకృష్ణ మాదిగ వర్గీకరణను అడ్డుకోవాలని చూస్తున్నాడన్నారు. అంబేద్కర్ వాదాన్ని అగ్రకులాలకు, మనువాదులకు తాకట్టుపెట్టే కుట్ర చేస్తున్నాడని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాదిగలకు 9శాతం రిజర్వేషన్ ఇచ్చాడన్నారు. కృష్ణమాదిగ ముఖ్యమంత్రిని కలిసేటప్పుడు మాదిగ మేధావులు, కళాకారులను ఎందుకు తీసుకుపోలేదని విమర్శించారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో వర్గీకరణను చట్టం చేయాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తిచేశారు. ఈ సమావేశంలో మాదిగ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మట్టి గురుమూర్తి, ఎండీహెచ్ రాష్ట్ర అధ్యక్షుడు కొరిపల్లి శ్రీనివాస్, నకిరికంటి సంజీవరావు, కొరకొప్పు రామారావు, రాయల రాంబాబు పాల్గొన్నారు.

ప్రధాని దృష్టికి కిష్టారం సమస్య

- నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేస్తాం
- బీజేపీ జాతీయ నాయకుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి

సత్తుపల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు అతిక్రమించి సింగరేణి నిర్మించిన సైలో బంకర్ కారణంగా అనారోగ్యం పాలవుతున్న కిష్టారం గ్రామ ప్రజల సమస్యను ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్తానని బీజేపీ జాతీయ నాయకుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి అన్నారు. సత్తుపల్లి మండలం కిష్టారం గ్రామంలో అంబేద్కర్‌నగర్, బీసీ కాలనీ వాసులు చేపట్టిన రిలే నిరాహారదీక్ష 12వ రోజుకు చేరుకోగా పొంగులేటి సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్థులు వినతిపత్రాన్ని అందజేయగా సమస్యను ప్రధానితో పాటు బీజేపీ కేంద్ర మంత్రులు, రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు, కలెక్టర్, సింగరేణి అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ సైలోబంకర్ వల్ల వెలువడే కాలుష్యంతో ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపే అవకాశం ఉందని, పర్యావరణ అనుమతులు తీసుకోకపోవడాన్ని ఆయన తప్పుపట్టారు. అతి ముఖ్యమైన గ్రామసభ పెట్టకపోవడం, గ్రామ పంచాయతీ తీర్మానం పెట్టకపోవడం సరికాదన్నారు. సీహెచ్‌పీ, సీసీపీలు నిర్మించగా నాణ్యత లోపించిన బంకర్ల విషయంపై సెంట్రల్ విజిలెన్స్ శాఖకు ఫిర్యాదు చేస్తామన్నారు. నియమ నిబంధనల ఉల్లంఘనపై సంస్థ అధికారులను బాధ్యులను చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా ఆలోచించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం పునరావాసం కల్పించాలని, లేకుంటే సీహెచ్‌పీని తొలగించాలని కోరారు. ప్రజల గోస వినాల్సిన సింగరేణి యాజమాన్యం బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. ఈ ప్రాంతానికి చెందిన వ్యక్తిగా ఇక్కడి ప్రజా సమస్యలను తెలిసిన వాడిగా ఇదే విషయమై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

సీహెచ్‌పీ, సీసీపీ, కార్మికుల క్వార్టర్ల నిర్మాణంలో అవకతవకలు జరిగాయని, సంతకాలు చేసిన వారు, అనుమతులు ఇచ్చిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సింగరేణి సీఎండీ వచ్చి స్వయంగా మాట్లాడి పరిష్కరించాలని, ఇప్పటికే కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డికి విన్నవించి తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. వాటరింగ్, గ్రీనరీ, హెల్త్ క్యాంపులు, ఆరోగ్య పరీక్షలపై గతంలో పోరాడామని, ఎన్‌జీపీలో ఫిర్యాదు చేయగా తమ పోరాట ఫలితంగా గతంలో దాదాపు రూ.40కోట్లు జమ చేసిందన్నారు.

ఈ కార్యక్రమంలో నంబూరి రామలింగేశ్వరరావు, ఈవీ.రమేష్, నాయుడు రాఘవరావు, నన్నె ఉదయ్‌ప్రతాప్, బీ.వీరంరాజు, పాలకొల్లు శ్రీను, రహ్మతుల్లా, సుదర్శన్‌మిశ్రా, మట్టా ప్రసాద్, మధుసూదన్, విజయ్, రాంబాబు, రఘునాథరెడ్డి, నాని వినయ్ తదితరులు పాల్గొన్నారు.

సైలోబంకర్‌కు పిండప్రదానం

కిష్టారం రిలే నిరాహార దీక్షలు 12వ రోజుకు చేరుకున్న సందర్భంగా మృతిచెందిన బాధిత కుటుంబ సభ్యులు సైలోబంకర్ చిత్రపటానికి శాస్త్రోక్తంగా పిండప్రదానం చేశారు. సైలోబంకర్‌తో ఇప్పటికే 50కి పైగా వివిధ వ్యాధులతో మృత్యువాత పడ్డారని, పలు కుటుంబాలు శ్వాసకోశ, చర్మ సంబంధిత వ్యాధులతో అల్లాడుతున్నారన్నారు. ఇకనైనా తమకు విముక్తి కల్పించాలంటూ బాధిత కుటుంబ సభ్యులు పూజలు చేశారు.

తాగునీటి సమస్య ఉందా..?
08744- 241950కు ఫోన్ చేయండి

- భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి.పాటిల్

కొత్తగూడెం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): తాగునీరు రాకపోయిన, పైపు లీకేజీ ఉన్న ఫోన్ చేయడం ద్వార సమస్యను పరిష్కరిస్తామని భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వేసవిలో తాగునీటి సమస్యల పరిష్కారానికి ఐనా, తాగునీటి సమస్య తలెత్తి అధికారులు నిర్లక్ష్యం వహించిన అధికారులకు తెలియక నీళ్లు రాకపోయిన ప్రజలు ఇబ్బంది పడవద్దని ఐడీఓసీ కార్యాలయంలో ప్రత్యేకంగా 08744 241950 ద్వారా ఫిర్యాదులు స్వీకరించి తక్షణమే వాటి పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. ఫోన్‌కాల్ ద్వార వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించేలా తగు చర్యలు తీసుకోవాలని మిషన్ భగీరథ ఈఈ తిరుమలేష్‌ను ఆదేశించారు. రాష్ట్రస్థాయిలో టోల్ ఫ్రీ 18005994007 నెంబర్‌కు కూడ ఫిర్యాదు చేయవచ్చని ఆయన తెలిపారు. ఏదైన గ్రామంలో తాగునీటి సమస్యల ఏర్పడితే స్థానిక అధికారులు చుట్టు తిరగాల్సిన పని లేకుండ టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయవచ్చని, మీ ఫిర్యాదు రాష్ట్ర కార్యాలయంలో రికార్డు అవుతుందని తర్వాత అక్కడి అధికారులు ఆ సమస్యను సంబంధిత అధికారికి తెలుపుతారని ఆ అధికారి సంబంధిత అధికారిని క్షేత్రస్థాయికి పంపి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సమస్య పరిష్కారమైన తర్వాత ఆ విషయాన్ని జిల్లా అధికారి తిరిగి రాష్ట్ర కార్యాలయానికి తెలుపుతామని, టోల్ ఫ్రీ నెంబర్ కార్యాలయం అధికారులు ఫిర్యాదుదారునికి ఫోన్ చేసి సమస్య పరిష్కారమైందా లేదా.. అని ధృవీకరించుకుంటారని కలెక్టర్ తెలిపారు.

పట్టువదలని
అక్రమార్కులు!

(5వ పేజీ తరువాయి)

సర్వేలో కూడా పలుచోట్ల అక్రమాలకు పాల్పడినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సత్తుపల్లి మునిసిపాలిటీలో వార్డు ఆఫీసర్ వినోద్ రేషన్‌కార్డు మంజూరుకు రూ.3వేలు లంచం అడిగి రూ.2500 తీసుకుంటుండగా ఏసీబీకి పట్టుబడ్డాడు. ఇది కేవలం బయటకు వచ్చిన వ్యవహారం.

జిల్లాలో మరికొన్నిచోట్ల కూడా పెద్దఎత్తున సర్వేలో కొందరు సొమ్ములు ముట్టచెప్పి రేషన్ కార్డులకు అర్హులుగా పొందినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామాల్లో లక్షన్నర.. పట్టణాల్లో రెండులక్షల ఆదాయం కలిగిన వారికే తెల్లకార్డులు ఇవ్వాలి. కానీ అధికంగా భూములున్న పెద్ద రైతులుకూడా సర్వేలో అర్హులుగా గుర్తింపు పొందినట్టు సమాచారం. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి ఖమ్మం జిల్లాలో 30,665 కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తులు రాగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 43,061 దరఖాస్తులు వచ్చాయి. వీటిని మండల, గ్రామస్థాయిలో సర్వే నిర్వహించారు. నిబంధనల ప్రకారం సర్వేచేస్తే పెద్ద ఎత్తున అనర్హుల జాబితా వెల్లడయ్యే అవకాశం ఉంది. కానీ సర్వేలో కొందరు చూసీచూడనట్టుగా వ్యవహరించగా కొందరు చేతివాటానికి పాల్పడినట్టు ఆరోపణలున్నాయి.

ఇందిరమ్మ ఇండ్లకు సైతం ఉభయ జిల్లాల్లో పెద్దఎత్తున దరఖాస్తులు వచ్చాయి. ఖమ్మం జిల్లాలో 3లక్షల57వేలు, భద్రాద్రి జిల్లాలో 2లక్షల73వేలు దరఖాస్తులు రాగా అధికారులు సర్వే నిర్వహించారు. ఇక్కడ కూడా లబ్ధిదారుల ఎంపికలో కొన్నిచోట్ల సిఫార్సులు సాగినట్టు ఆరోపణలున్నాయి. ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల గుర్తింపులో చేతివాటానికి పాల్పడి రెడ్ హ్యాండెడ్‌గా బుక్ కావడం జిల్లాలో పారదర్శక సర్వేకు పెద్దమచ్చగా మిగిలింది.

గత డిసెంబరులో ఖమ్మం జిల్లా కలెక్టరేట్‌లోని ట్రెజరీ ఉద్యోగి నగేష్ పెన్షనర్ నుంచి రూ.30వేల లంచం అడిగినందుకు అరెస్టయ్యారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల పంచాయతీ సెక్రటరీ పుల్లయ్య, దమ్మపేట ల్యాండ్ సర్వేయర్ మెరుగు రత్నం రూ.50 వేలు, కొత్తగూడెం మెడికల్ కాలేజీకి చెందిన సూపరింటెండెంట్ ఖలీలుల్లా, ఏవో సుధాకర్ రూ.3లక్షలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనే లైన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు రూ.26వేలు, అదే జిల్లాలోని ఎలక్ట్రికల్ ఏఈ ధరావత్ శరత్ రూ.లక్ష, రెవెన్యూ డీటీ భరణి బాబు రూ.15వేలు, పాల్వంచ ఎస్ఐ బానాల రాజు రూ.20వేలు, ఇదే జిల్లాలోని పంచాయతీ ఎంపీవో బత్తిని శ్రీనివాస్, ఆళ్లపల్లి సెక్రటరీ తాటి నాగరాజు రూ.15 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కి అరెస్టయ్యారు.

భద్రాద్రి కలెక్టరేట్‌లోని జిల్లా హార్టికల్చర్ అధికారి కుసుమ సూర్యనారాయణ రూ.లక్షా14 వేలు లంచం తీసుకుంటూ గతేడాది సెప్టెంబరులో ఏసీబీకి చిక్కాడు. గతేడాది జనవరిలో ఖమ్మానికి చెందిన పోలీసు హెడ్‌కానిస్టేబుల్ పగడాల కోటేశ్వరరావు రూ.50వేలు, గతేడాది ఏప్రిల్‌లో భద్రాచలం టౌన్ ఎస్ఐ ఎం.శ్రీనివాస్, కానిస్టేబుల్ శంకర్ రూ.20 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచకు చెందిన టౌన్‌ప్లానింగ్ అధికారులు లక్కిరెడ్డి వెంకరటమణ, హసన్ గతేడాది ఏప్రిల్‌లో రూ.15 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు.

కార్పొరేట్ శక్తులకు పాలకుల వత్తాసు

(5వ పేజీ తరువాయి)

శ్రమదోపిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం వ్యాపారుల దయా దాక్షిణ్యాలపై హమాలీ కుటుంబాలు నిలబడుతున్నాయన్నారు. దశాబ్దాలుగా కార్మిక సంఘాలు అనేక పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక హక్కుల చట్టాలను మోదీ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. హమాలీలకు రక్షణ చట్టాలను తీసుకరావాలని, నెల వేతనాలు కనీసం రూ.26వేలు వచ్చేలా జీవోలను తీసుక రావాలని కోరారు. కార్మిక వర్గాన్ని బానిసలుగా మార్చే నాలుగు లెబర్ కోడ్స్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులు, కర్షకుల పట్ల తీవ్ర మొండి వైఖరి అవలంభిస్తున్నాయని ఆరోపించారు. హమాలీ కార్మికులు లేకుంటే రవాణ రంగం లేదన్నారు. ఒక్క కార్పొరేట్ సంస్థకు కేంద్ర ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలతో దేశంలోని హమాలీల కుటుంబాల ఆర్థిక స్థితిగతులను మార్చే అవకాశం ఏర్పడుతుందన్నారు. నిత్యం బస్తాలు, సరుకు రవాణా మోస్తున్న హమాలీ కుటుంబాలు దుర్భర జీవితాలను గడుపుతున్నాయని, కేంద్రంలోని మోదీ ప్రభుత్వం హమాలీల శ్రేయస్సుపై ఆలోచన చేయాలని, హమాలీలకు ఆర్థికంగా అండగా ఉండే చట్టాలను తీసుకురావాలని డిమాండ్ చేశారు. రూ.కోట్లాది సంపదను కార్పొరేట్ శక్తులకు అందిస్తున్న కేంద్ర ప్రభుత్వం పేదలను మరింత పేదలుగా మారుస్తుందని విమర్శించారు. అమెరికా పర్యటనకు వెళ్లిన ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఎదుట మోకరిల్లారు తప్ప, భారతదేశానికి ప్రయోజనం చేకూర్చలేదన్నారు. భారతదేశంపై అమెరికా వైఖరీ మార్చుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి జీ.రామయ్య, నాయకులు ఆవుల అశోక్, యాకూబ్ షావలి, ఎస్.కిరణ్, జక్కుల యాకయ్య, గోల్ల సీతారాములు, ఏ.అంజనేయులు, కే.లక్ష్మణ్, ఎన్. శ్రీనివాసులు, నర్సింహారావు, పుల్లారావు, బొమ్మకంటి రమేష్, నవీబాయి, గోపాల్, సంఘపాగు లూథర్, జగన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

గాలిదుమారం.. చిరుజల్లులు..

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మారిన వాతావరణం

కొత్తగూడెం/చంద్రుగొండ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పలు మండలాల్లో శుక్రవారం సాయంత్రం గాలిభీభత్సం, దుమ్ముదూళితో ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు కురిసాయి. వేసవి కాలాన్ని తపిస్తున్న ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా వాతావరణం చల్లబడిపోయింది.

జల్లుల ఓ మో స్తారు నుంచి చిరుజల్లులు కురవడంతో అ యా మండలాల్లోని మిర్చి రైతులు ఆందోళన చెందారు. కొత్తగూడెం, పాల్వంచ ప్రాంతాల్లో ఓ మోస్తారుగా వర్షం కురిసింది. గాలిదుమ్ము ఒక్కసారిగా కమ్ముకుంది. చంద్రుగొండ, సుజాతనగర్, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, టేకులపల్లి, జూలూరుపాడు, బూర్గంపాడు, ములకలపల్లి, ఇల్లెందు తదితర మండలాల్లో కూడ గాలిదుమ్ముతో చిరుజల్లులకు కురిసాయి. అయా ప్రాంతాల్లో కలాల్లో ఆరబోసిన మిర్చి చిరుజల్లులకు తడుస్తున్నాయనే భయం తో రైతులు పట్టాలు కప్పుకున్నారు. ఆకాశమంతా మేఘావృతం కావడంతో సాయంత్రం 4గంటలకు పూర్తిగా చల్లబడింది.

నీటి ఎద్దడిపై ముందస్తు యుద్ధం

(5వ పేజీ తరువాయి)

ఇతర మరమ్మతులు చేయించడం, పైపులైన్ లీకేజీలు గుర్తించి కొత్త పైపులు వేయడం, మురుగు కాలువల్లో పైపులైన్లు లేకుండా చర్యలు తీసుకోవడం.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

జిల్లాలో దాదాపు 42 గ్రామాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు. జిల్లాలోని 931 గ్రామాలకు మిషన్ భగీరథ నీటితో పాటుగా ఆయా గ్రామాల్లో 8,808 చేతిపంపులు ఉన్నాయి. 501 బోర్లు మరమ్మతులకు గురయ్యాయి. 256 సింగిల్ ఫేస్ మోటార్లలో, 11 మోటార్లు వర్కింగ్‌లో రిపేర్లు అవసరమైనట్టుగా గుర్తించారు. 1,422 పీడబ్ల్యూఎస్ఎస్ స్కీములకు గాను 78 రిపేర్లకు చేయాల్సి ఉంది. ఓపెన్ వెల్స్ 280 ఉన్నాయి.వీటన్నింటినీ రిపేరు మార్చి 15 నాటికి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. దీనికి అనుగుణంగా గ్రామాల్లో కూడా ఎంపీవోలు సెక్రటరీలతో సంయుక్త కార్యాచరణను నిర్వహించుకుని మరమ్మత్తులను చేపట్టనున్నారు.

టోల్‌ఫ్రీ నెంబర్ 1800 599 4007

వేసవి నేపథ్యంలో జిల్లాలో ఎక్కడైనా తాగునీటికి సమస్యలు ఎదుర్కొంటున్నా... ఎలాంటి సమస్యలున్నా 1800 599 4007 టోల్‌ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయవచ్చని జిల్లా మిషన్ భగీరథ ఈఈ పుష్పలత తెలిపారు. వేసవిలో మంచినీటి ఎద్దడిని నివారించేందుకుగాను రాష్ట్ర కార్యాలయంలో మానిటరింగ్ సెల్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రజలు ఏమైనా ఫిర్యాదులు ఉంటే ఈ నెంబర్‌కు కాల్ చేస్తే తమ సిబ్బంది సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్టు ఈఈ తెలిపారు.

ఇష్టపడి చదవండి...



భోజనాన్ని పరీక్షిస్తున్న కలెక్టర్

బూర్గంపాడు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ వసతి గృహాల బాట పట్టారు. వాటి పనితీరును మెరుగుపర్చేందుకు ప్రత్యక్ష కార్యాచరణకు పూనుకున్నారు. బూర్గంపాడులోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని శుక్రవారం రాత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి రాత్రి బస చేశారు. వసతి గృహంలో ఎంతమంది ఉన్నారని రికార్డులు, విద్యార్థులకు వండిన భోజనాన్ని పరిశీలించారు. బియ్యం స్టాక్ రిజిస్టార్, బియ్యాన్ని ఎప్పుడెప్పుడు శుభ్రం చేస్తున్నారని వంట ఏజెన్సీ నిర్వాహకులను ప్రశ్నించారు. అనంతరం వసతిగృహంలోని పరిసరాలను, మరుగుదొడ్లను పరిశీలించి ప్రతిరోజు మరుగుదొడ్లు శుభ్రం చేయాలని ఆదేశించారు. విద్యార్థులు నిద్రించేందుకు ఏర్పాటు చేసిన బెడ్లను పరిశీలించి ఇంతమంది విద్యార్థులకు ఈ బెడ్లు ఎలా సరిపోతాయి..? మిగిలిన వారు కింద పడుకుంటున్నారా అని అధికారులను ఆరా తీశారు. స్టడీ అవర్‌ను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడుతూ వారి నైపుణ్యాన్ని పరిశీలించారు. ఎలాంటి ఒత్తిడి లేకుండా చదవాలని సూచించారు. కలెక్టర్ వెంట ఎస్సీ సంక్షేమ అధికారి అనసూయ, ఏఈ ఎడబ్ల్యూవో హనుమంతరావు, హాస్టల్ వార్డెన్ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.



బ్యాంకులకు బురిడీ

- మెప్మాలో అక్రమ పద్ధతిలో సంఘలకు రుణాలు
- బినామీ సంఘాల పేరుతో లక్షలు దండుకున్న ఆర్పీలు
- అమాయక మహిళలకు ఎరవేసి దర్జాగా అక్రమాలు
- రూ.1.5 కోట్ల వరకు మోసం జరిగినట్టు వెల్లడి
- టార్గెట్ల కోసం నిబంధనలను పట్టించుకోని బ్యాంకర్లు
- వార్షిక రికవరీల నోటీసులతో వెలుగులోకి వచ్చిన స్కామ్

ఖమ్మం సంక్షేమ విభాగం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలోని పట్టణ పేదిరిక నిర్మూలన సంస్థ (మెప్మా)కు అవినీతి మరకలు అంటుకున్నాయి. కొంతమంది రిసోర్స్ పర్సన్(ఆర్పీ)లు మహిళా స్వయం సహాయక సంఘంలోని సభ్యుల్ని మోసం చేశారు. ఒక్కో సభ్యురాలికి రూ.10వేలు ఎర వేసి ఆయా సంఘాల నుంచి రూ.20లక్షలు దండుకున్నారు. నగరంలోని మెప్మాలో 160కు పైగా ఆర్పీలున్నారు. వీరు 40వేలకు పైగా ఎస్‌హెచ్‌జీ సభ్యుల ఆర్థిక స్వాలంబనకు కృషి చేస్తున్నారు. వీరిలో ఓ పదిమంది ఆర్పీలు మాత్రం 2020 నుంచి అవినీతి ఊబిలో చిక్కుకొని మొత్తం మెప్మా వ్యవస్థకే అవినీతి మరకలను అంటిస్తున్నారు.

టార్గెట్ కోసం రుణాలు

10మంది సభ్యులతో ఒక మహిళా సంఘం ఏర్పాడిన తర్వాత ఆరు నెలల కాలం గడిసిన తర్వాతనే ఆ సంఘానికి బ్యాంకర్లు రుణాలు ఇవ్వాల్సి ఉంటుంది. సంఘంలోని సభ్యులు ఒకే ప్రాంతానికి చెందినవారై ఉండాలి. కానీ 2020లో కొందరు ఆర్పీలు అతి తెలివితేటలలతో సాంకేతికతను వాడుకొని అవినీతికి తెరలేపారు. ఖమ్మంలోని మూడు జాతీయ బ్యాంకుల మేనేజర్లను బురిడీ కొట్టించారు.

నగరంలో గుడిసెలు వేసుకొని వీధుల వెంట చిరు వ్యాపారం చేసేవారు, సంచార జాతుల మహిళల వద్దకు కొందరు ఆర్పీలు వెళ్లి మీకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రూ.10వేలు డబ్బులు వస్తాయని నమ్మించారు. వారి ఆధార్ ఇతర వివరాలను తీసుకొని సంఘాలు ఏర్పాటు చేసి బ్యాంకు వద్దకు వెళ్లి పాస్ పుస్తకాలు తీసుకున్నారు. కొద్ది రోజులకు బ్యాంకు మెనేజర్లు ఒక్కో సంఘం బ్యాంకు ఖాతాకు రూ.20 లక్షల చొప్పున రుణాలను మంజూరు చేయించారు. పాస్ పుస్తకాలను ఆర్పీలు తమ వద్దనే ఉంచుకొని బ్యాంకు ఖాతాలున్న మహిళలకు రూ.10వేల చొప్పున అందించారు. అదే మహాభాగ్యంగా ఆ మహిళలు సంతోషపడ్డారు. ఇలా 40 బ్యాంకు ఖాతాల నుంచి రూ.2 కోట్లకు పైగా ఆర్పీలు డబ్బులు దండుకున్నారు.

బ్యాంకర్ల సహకారంతోనే..

కనీసం ఆరు నెలల సీనియారిటీ లేకుండా ఒక్కో మహిళా సంఘానికి రూ.20 లక్షల రుణాలు ఇవ్వటంలో బ్యాంకు అధికారుల పాత్రపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. నగరంలోని వేర్వేరు ప్రాంతాలకు చెందిన సంచార జాతుల మహిళలు, నిరుపేదల ఆర్థిక పరిస్థితులు తెలియకుండా బ్యాంకర్లు అధికంగా రుణాలు ఎలా ఇచ్చారనే ప్రశ్నలు వస్తున్నాయి.

ఆర్పీపై వేటు

ఖమ్మం మెప్మా పరిధిలో మొత్తం పది మందికి పైగా ఆర్పీలు ఇటువంటి అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. గురువారం ఒక ఆర్పీని విధుల నుంచి తొలగించారు. మిగిలిన వారిపై ఎటువంటి చర్యలు తీసుకుంటారనే అనే విషయంపై చర్చ జరుగుతుంది. ఆర్పీలు తర్వాత కాలంలో వన్ టైం సెటిల్‌మెంట్ బ్యాంకర్లతో నిర్వహించినా కూడా ఆర్థిక నేరంగానే భావించాల్సి ఉంటుంది.

రికవరీ నోటీసులతో వెలుగులోకి...

రూ.20 లక్షలు బ్యాంకు రుణం తీసుకున్న సంఘం బ్యాంకు ఖాతాలో రూ.4లక్షలు ఉంచి మిగిలిన డబ్బులను ఆర్పీలు తీసుకున్నారని తెలిసింది. 2020 తర్వాత సంఘాల బ్యాంకు ఖాతాలోని రూ.4లక్షలను బ్యాంకులు నెల వారీగా జమ చేసుకున్నాయి. 2025నాటికి ఖాతాల్లో డబ్బులు లేక పోవటంతో ఆయా బ్యాంకులు సంఘాల్లోని మహిళలకు వ్యక్తిగత నోటీసులు జారీ చేశాయి. సభ్యులకు సంబంధించి ఆర్పీలు నకిలీ చిరునామాలు ఇచ్చారు. సదరు చిరునామాలకు వెళ్లటంతో మెప్మాకు మహిళలు పరుగులు తీశారు.

రూ.64.42 కోట్ల ధాన్యం బోనస్ పెండింగ్

వైరా, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంజిల్లాలో సన్నరకం ధాన్యం అమ్మిన 23,244మంది రైతులకు బోనస్ సొమ్ము రూ.64కోట్ల, 41లక్షల 83,400 ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. గత ఏడాది ఖరీఫ్‌లో జిల్లాలోని మొత్తం 47,494 మంది రైతుల నుంచి 27లక్షల, 26వేల, 660 క్వింటాళ్ల సన్నరకం ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది. క్వింటా ఒక్కింటికి రూ.500బోనస్ చొప్పున ప్రభుత్వం రూ.136 కోట్ల, 33లక్షల, 30వేలను 47,494మంది రైతులకు చెల్లించాల్సి ఉంది. అయితే ఇప్పటివరకు 24,250మంది రైతులకుగానూ 14లక్షల, 38వేల, 293క్వింటాళ్ల ధాన్యానికి రూ.71కోట్ల, 91లక్షల, 46,600చెల్లించింది. ఇంకా 23,244మంది రైతులకు సంబంధించిన 12లక్షల, 88వేల, 367 క్వింటాళ్ల ధాన్యానికి రూ.64కోట్ల, 41లక్షల, 83,400చెల్లించాల్సి ఉంది. వేలాదిమంది రైతులు తమకు రావల్సిన కోట్లాదిరూపాయల బోనస్ సొమ్ము కోసం బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. జిల్లాలోనే అత్యధికంగా వైరా మండలంలోని 3,115మంది రైతులకు రూ.9.84కోట్లపైచిలుకు బోనస్ సొమ్ము రైతులకు రావల్సి ఉంది.

మండలాల వారీగా వివరాలు...

మండలం	బోనస్ పొందిన రైతుల సంఖ్య	బోనస్ (రూ.లలో)	బోనస్ అందని రైతులు	పెండింగ్ సొమ్ము
బోనకల్	58	10,71,600	654	1,42,58,200
చింతకాని	73	20,85,800	771	1,76,87,600
ఏన్కూరు	288	84,33,800	477	1,27,35,600
కల్లూరు	5,170	1,67,96,8200	1574	4,36,58,400
కామేపల్లి	110	24,17,400	543	12,96,66,600
ఖమ్మంరూరల్	219	46,33,200	738	17954200
కొణిజర్ల	598	1,23,89,400	1244	2,57,26,000
కూసుమంచి	1701	4,78,01,000	988	2,42,38,200
మధిర	206	56,35,400	662	1,41,79,600
ముదిగొండ	1,052	3,02,58,000	1,807	4,30,40,000
నేలకొండపల్లి	2,049	5,35,8,3200	2,207	61989800
పెనుబల్లి	2,990	9,55,51,400	1,655	4,97,89,400
రఘునాథపాలెం	147	3,41,22,00	398	87,93,800
సత్తుపల్లి	1,271	4,044,5000	207	70,69,400
సింగరేణి	66	11,05,800	223	62,60,000
తల్లాడ	3,530	1,24,49,1200	2252	10,09,81,200
తిరుమలాయపాలెం	372	86,03,800	606	1,31,43,800
వేంసూరు	3,277	8,0,1,60,600	2,449	5,60,10,800
వైరా	721	2,04,69800	3,115	9,84,48,200
ఎర్రుపాలెం	352	86,29,800	674	1,52,52,600
మొత్తం	24,250	71,91,46,600	23,244	64,41,83,400

‘ పెండింగ్ బోనస్ వెంటనే చెల్లించాలి ’

వైరా, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న సన్నరకం ధాన్యం బోనస్ సొమ్మును వెంటనే చెల్లించాలని, రైతు భరోసా చెల్లింపుల్లో ఉన్న అయోమయం గందరగోళాన్ని తొలగించాలని, రూ.రెండులక్షల రుణమాఫీ పూర్తిగా అమలుచేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం వైరా తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. రెండునెలల నుంచి సన్నరకం ధాన్యం బోనస్ కోసం రైతులు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారని, ఇంకా జిల్లాలో 23,244మంది రైతులకు రూ.65కోట్లు పెండింగ్‌గా ఉందని వెంటనే వాటిని చెల్లించాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ కేవీ శ్రీనివాసరావుకు ఒక వినతి పత్రం సమర్పించారు. రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, నాయకులు చింతనిప్పు చలపతిరావు, బాణాల శ్రీనివాసరావు, పారుపల్లి కృష్ణారావు, మేడా శరాబందీ, తోట నాగేశ్వరరావు, కురుగుంట్ల శ్రీనివాసరావు, సంక్రాంతి నర్సయ్య, సాంబశివరావు పాల్గొన్నారు.

బోధనా సిబ్బంది క్రీడా స్ఫూర్తి అభినందనీయం

- వ్యవసాయ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ జానయ్య

అశ్వారావుపేట, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): బోధన సిబ్బంది ఎంతో క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించి అందరి మన్ననలను పొందారని, విధులలో శారీరక దృఢత్వానికి ఎంతో ప్రాధాన్యం ఉందని ప్రొ. జయశంకర్ తెలంగాణ వ్యవసాయ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆల్దస్ జానయ్య అన్నారు. యూనివర్సిటీ స్థాయి బోధన సిబ్బందికి మూడు రోజులుగా జరుగుతున్న క్రీడా, సాంస్కృతిక పోటీలు శుక్రవారంతో ముగిసాయి. ముగింపు కార్యక్రమంలో వైస్ చాన్సలర్ హాజరై ప్రసంగించారు. యూనివర్సిటీ స్థాయిలోని నాలుగు జోన్లకు సంబంధించిన బోధన సిబ్బంది వివిధ రకాల క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. రాజేందర్‌నగర్ కళాశాలకు చెందిన మహిళల టీము స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌లో ఓవరాల్ ఛాంపియన్ షిప్‌ను పొందారు. సాంస్కృతిక కార్యక్రమాలలో తెలంగాణ సెంట్రల్ జోన్ టీము ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను సాధించారు. విజేతలకు వైస్ చాన్సలర్ బహుమతులు అందజేశారు. పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు, తెలంగాణ ఫోక్ సాంగ్స్‌కు అనుగుణంగా చేసిన నృత్యాలు పలువురిని ఆకర్షించాయి. ఈ మీట్‌ను విజయంతంగా నిర్వహించిన కళాశాల డీన్ హేమంత్‌కుమార్‌ను వైస్ చైర్మన్‌ను అభినందించారు.



మాట్లాడుతున్న వీసీ జానయ్య

భూ నిర్వాసితులకు న్యాయం చేయాలి

- ఆదివాసీ సంఘాల జేఏసీ జాతీయ అధ్యక్షుడు చందా లింగయ్యదొర

మణుగూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మణుగూరులోని భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ ఏర్పాటులో భూ నిర్వాసితులైన ఆదివాసీలకు నేటికీ న్యాయం జరగలేదని, న్యాయం జరిగేంత వరకు తమ పోరాటాలను ఆపబోమని ఆదివాసీ సంఘాల జేఏసీ జాతీయ అధ్యక్షుడు చందాలింగయ్య దొర స్పష్టం చేశారు. శుక్రవారం ఈ విషయంపై హైదరాబాద్‌లో ప్రజావాణి కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లుభట్టి విక్రమార్కను కలుసుకుని సమస్యలను వివరిస్తూ వినతి పత్రాన్ని అందించారు. బీటీపీఎస్ నిర్మాణంలో భూములు కోల్పోయిన ఆదివాసీలకు 2014 సంవత్సరం నుంచి గత ప్రభుత్వం కేసీఆర్ నాయకత్వంలో తీరని అన్యాయమే జరిగిందన్నారు. గిరిజన భూములపై గిరిజనేతరులకు కాస్తులో ఉన్నట్లు తప్పుడు రికార్డులు సృష్టించి గ్రామ స్థాయి అధికారుల నుంచి జిల్లా స్థాయి వరకు ఉన్న అధికారులు ప్రభుత్వం కేటాయించిన భూమి ఖరీదు మొత్తం సొమ్ములు రూ.400 కోట్లను దిగమింగారని ఆరోపించారు. దీనిపై సమగ్రమైన విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన ఆదివాసీలకు భూమి ఖరీదుతో పాటు కుటుంబానికి ఉద్యోగం, ప్రత్యేక ప్యాకేజీ, గృహ నిర్మాణం, పునరావాసం కల్పించాలని ఉప ముఖ్యమంత్రిని భట్టిని కోరారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం నాయకులు గొగ్గల అర్కెదొర, పినపాక మండల అధ్యక్షుడు కొమరం శ్రీను, పోలిశెట్టి హరీష్, కొమరం శేఖర్, బిల్ల సాంబశివరావు, జట్ట నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



భట్టి విక్రమార్కకు సమస్యలు వివరిస్తున్న చందాలింగయ్య

చికిత్స పొందుతూ బాలిక మృతి



అశ్వారావుపేటరూరల్, ఫిబ్రవరి21 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతానికి గురైన చిన్నారి చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందింది. మండలంలోని ఊట్లపల్లి గ్రామానికి చెందిన కేతా లక్ష్మీ(13) హైదరాబాదులో ఉంటుండగా ఆమె కూతురు లాస్య అమ్మమ్మ అమ్మాజి వద్ద ఉంటూ అశ్వారావుపేటలో 8వతరగతి చదువుతుంది. ఈనెల16న సాయంత్రం లాస్య ఇంటిపైన ఉన్న బట్టలు తీస్తుండగా పక్కనే ఉన్న కరెంటు తీగలు తగిలి ప్రమాదానికి గురైంది. తీవ్రంగా గాయపడిన లాస్యను అశ్వారావుపేటలో చికిత్స అనంతరం హైదరాబాదులోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న లాస్య పరిస్థితి విషమించి శుక్రవారం సాయంత్రం మృతిచెందింది. ఘటనకు విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యమే కారణమంటూ శుక్రవారం ఉదయం గ్రామస్తులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

వరిపొలంలో క్షుద్రపూజలు

వైరా, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): వైరామునిసిపాలిటీ పరిధిలోని మధిర రోడ్డులో ఇందిరమ్మకాలనీ సమీపంలో ఓ రైతు సాగుచేసిన వరిపొలంలో గుర్తుతెలియని వ్యక్తులు క్షుద్రపూజలు చేసిన ఉదంతమిది. శ్రీనివాసరావు అనే రైతు శుక్రవారం ఉదయం తమ వరిపొలానికి వెళ్లేసరికి ఓ మడిలో గుంత తీసి మళ్లీ పూడ్చిన ఆనవాలు కన్పించాయి. ఆవెంటనే రైతు శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పేకాట స్థావరంపై దాడి

ఏడుగురిపై కేసు నమోదు

కారేపల్లి, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మాధారం గ్రామంలో శుక్రవారం ఓ ఇంట్లో పేకాడుతున్న సమాచారం అందుకున్న ఎస్ఐ.ఎన్ రాజారాం తన సిబ్బందితో దాడిచేశారు. వారి నుంచి ఏడు సెల్‌ఫోన్లు, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేశారు. పేకాట ఆడితే ఉపేక్షించేది లేదన్నారు.

ఇసుక అక్రమ రవాణా: ఆరుగురిపై కేసు

ఐదు ట్రాక్టర్లు, జేసీబీ సీజ్

జూలూరుపాడు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు లేకుండా వాగులో నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తుండటంతో పోలీసులు దాడులు నిర్వహించి వాహనాలను శుక్రవారం తెల్లవారుజామున పట్టుకుని సీజ్ చేశారు. ఆరుగురిపై కేసు నమోదు చేశారు. ఎస్ఐ బాదావత్ రవి వివరాల ప్రకారం.. మండలంలోని బేతాళపాడు పంచాయతీ పరిధిలోని చీపురుగూడెం గ్రామ సమీపంలోని పెద్దవాగులో ఎక్సకవేటర్‌తో ఇసుకను తోడి ట్రాక్టర్లలో బేతాళపాడు గ్రామానికి చెందిన కొందరు ఇసుక రవాణా చేస్తున్నారు. ఈ సమాచారం మేరకు తమ సిబ్బంది దాడులు నిర్వహించగా పెద్దవాగు వద్ద ఒక ఎక్సకవేటర్, ఐదుట్రాక్టర్లు పట్టుబడ్డాయి. వాటిని సీజ్ చేసినట్లు తెలిపారు. బేతాళపాడు గ్రామానికి చెందిన ట్రాక్టర్ల డ్రైవర్లు ధారావత్ రాందాస్, బాదావత్ హుస్సేన్, నునావత్ భీమా, బాణోత్ కస్నా, గుగులోత్ సక్రు, ఎక్సకవేటర్ డ్రైవర్ పగడాల వేణుపై కేసు నమోదు చేశారు.



సీజ్ చేసిన ట్రాక్టర్లు. జేసీబీలను చూపిస్తున్న ఎస్సై రవి

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి ఆత్మహత్య

తోగ్గూడెంలో కుమారుడు చనిపోయాడనే మనోవేదనతో ఒకరు, ఇల్లెందులో యువకుడు



వెంకటేశ్(ఫైల్)

పాల్వంచ,ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి):పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై పాల్వంచ రూరల్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. మండల పరిధిలోని తోగ్గూడేనికి చెందిన మోడెం కృష్ణ(45) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సంవత్సరం క్రితం అతని కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందటంతో అప్పటి నుంచి కుమారుడిని తలచుకుంటూ మానసికంగా కృంగిపోయాడు. ఈక్రమంలోనే కొడుకు లేని జీవితం వ్యర్థమని భావించి శుక్రవారం ఉదయం ఇంట్లోని పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతి చెందాడు. మృతుడి భార్య వెంకటలక్ష్మి ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ సురేష్ కేసు నమోదు చేశారు.

ఇల్లెందుటౌన్: యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఇల్లెందు పట్టణంలోని నిర్వాసిత కాలనీలో చోటుచేసుకుంది. ఇల్లెందు పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని సుందరయ్య నగర్‌కు చెందిన జక్కుల వెంకటేశ్ (22) గురువారం రాత్రి నిర్వాసిత కాలనీలో నివాసముంటున్న తన మేనమామ శ్రీనివాస్ ఇంటికి వెళ్లాడు. ఆ సమయంలో ఇంట్లో మేనమామ ఆయన కుటుంబ సభ్యులు కూడా ఎవరు లేరు. రాత్రి నిద్రించేందుకు వెళ్లిన వెంకటేశ్ శుక్రవారం ఉదయం వరకు సుందరయ్య నగర్‌లోని తన ఇంటికి వెళ్లకపోవడంతో తల్లి పద్మ కొడుక్కి ఫోన్ చేసింది. ఎంత సేపటికి లిఫ్ట్ కాలేదు. అనుమానం వచ్చిన తల్లి పద్మ నిర్వాహిత కాలనీ తన తమ్ముడి ఇంటికి వెళ్లి చూడగా.. ఇంట్లో ఉరి వేసుకొని చనిపోయినట్లుగా గమనించింది. వెంకటేశ్ తండ్రి రెండు సంవత్సరాల క్రితమే కుటుంబాన్ని వదలివేసి వెళ్లిపోయాడు. పదో తరగతి చదువుకున్న వెంకటేశ్ ఓ హోటల్‌లో రోజువారి కూలీ నిమిత్తం పనిచేస్తుండేవాడు. కుటుంబంలో ఎలాంటి ఇబ్బందులు లేకపోయినా ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడనే కోణంపై ఇల్లెందు పోలీసులు విచారణ చేపడుతున్నారు. తల్లి పద్మ ఫిర్యాదు మేరకు ఇల్లెందు సీఐ బత్తుల సత్యనారాయణ కేసు నమోదు చేశారు.

చెల్లని చెక్కు కేసులో ఏడాది జైలు

ఖమ్మంక్రైం, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): చెల్లనిచెక్కు కేసులో ఖమ్మం నగరంలోని ముస్తాఫానగర్‌కు చెందిన కుతుంబాక ప్రవీణ్ కుమార్‌కు ఏడాది జైలు శిక్షతో పాటుగా రూ.9లక్షల నష్టపరిహారం ఇవ్వాలని ఖమ్మం మద్యపానం ప్రత్యేక న్యాయస్థానంలో తీర్పువెలువడింది. శుక్రవారం న్యాయాధికారి రాళ్లబండి శాంతిలత తీర్పును ఇచ్చారు. ఖమ్మం రాధాకృష్ణనగరానికి చెందిన పొలవరపు రమేశ్ వద్ద నిందితుడు 2016లో రూ.7లక్షలు అప్పుగా తీసుకున్నాడు. అదురోజు ప్రాంసరీ నోట్ రాసి ఇచ్చాడు. రుణం చెల్లించమని ఒత్తిడి చేయగా 2017లో రూ.9లక్షలకు చెక్కు జారీ చేశాడు. బ్యాంకులో జమ చేయగా, తగినంత నగదు లేకపోవటంతో చెక్కు నిరాదరణకు గురైంది. దీంతో కోర్టులో ప్రైవేటు కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావటంతో పైవిధంగా తీర్పు చెప్పారు. మరో కేసు లో ఇదే నిందితుడికి ఏడాది జైలు శిక్షతో పాటు, ఫిర్యాదికి రూ.8లక్షలు చెల్లించాలని న్యాయాధికారి తీర్పు చెప్పారు.

అక్కను చూసి వెళ్తూ అనంతలోకాలకు..

- ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కంటైనర్
- రంగంబంజరలో ఒకరి దుర్మరణం



తల్లాడ, ఫిబ్రవరి21 (ఆంధ్రజ్యోతి): అక్కను చూసేందుకు వచ్చి తిరిగి వెళ్తుండగా రోడ్డు ప్రమాదానికి గురై ఓ వ్యక్తి దుర్మరణం పాలైన సంఘటన శుక్రవారం తల్లాడ మండలం రంగంబంజర వద్ద చోటుచేసుకుంది. టీవీఎస్ మోపెడ్‌ను కంటైనర్ ఢీకొన్న ప్రమాదంలో పెనుబల్లి మండలం ముత్తగూడెం గ్రామానికి చెందిన బొగ్గుల నాగిరెడ్డి(55)అక్కడికక్కడే మృతి చెందాడు. నాగిరెడ్డి పైనుంచి కంటైనర్ వెళ్లడంతో దేహం ఛిద్రమైంది. తల్లాడ మండలం నారాయణపురం గ్రామంలో ఉన్న అక్క అవులూరి వెంకటరత్నాన్ని చూసేందుకు నాగిరెడ్డి టీవీఎస్‌పై ముత్తగూడెం నుంచి వచ్చాడు. అక్కతో మాట్లాడిన అనంతరం తిరిగి వెళ్తుండగా రంగంబంజర వద్ద తల్లాడ నుంచి కల్లూరు వైపు వెళ్తున్న కంటైనర్ వెనుక నుంచి ఢీకొట్టింది. మోపెడ్‌తో సహా నాగిరెడ్డి టైర్ల కింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. నాగిరెడ్డికి భార్య, కుమారుడు ఉన్నారు. కుమారుడు వెంకటసీతారెడ్డి ఫిర్యాదు మేరకు ఎస్‌హెచ్‌వో టి.వెంకటేశ్వర్లు కేసునమోదు చేశారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

- ఐటీడీఏ పీవో రాహుల్

దుమ్ముగూడెం/కరకగూడెం, ఫిబ్రవరి21 (ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యార్థులకు పాఠ్యాంశాలనుఅర్థమయ్యేలా బోధించాలని ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. రామచంద్రునిపేట, రేగుబల్లి-2 గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలను శుక్రవారం సందర్శించారు. ఆంగ్లం, గణితం సబ్జెక్టులు సులువుగా అర్థమయ్యేందుకు ప్రవేశపెట్టిన ఉద్దీపకం వర్క్‌బుక్స్, వేదిక్ మాథ్స్ పాఠ్యాంశాలను విద్యార్థులు చదువుతున్న తీరును పరిశీలించారు. వర్క్‌బుక్స్ సారాంశాన్ని విద్యార్థులను అడిగి తెలుసుకోవడంతోపాటు, సమాధానాలను బోర్డుపై రాయించారు. మూడు నుంచి ఐదు తరగతుల విద్యార్థులు గణితం, ఆంగ్లం చదవడం, రాయడానికి భయపడుతున్నారని, ఉద్దీపకం, వేదిక్‌మాథ్స్ సిలబస్‌ల ద్వారా పోగొట్టాలని సూచించారు. పిల్లలు ఏం చదువుతున్నారనే విషయాన్ని సబ్జెక్టు టీచర్లు నిరంతరం గమనించాలన్నారు. ఆర్‌సీపేట, రేగుబల్లి-2 పాఠశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపడతామన్నారు.

కల్యాణ పోస్టల్ ఆవిష్కరణ

కరకగూడెం: కరకగూడెం మండలంలోని సమత్ భట్టుపల్లి పంచాయతీ బుర్ధారం గ్రామం కారడివిలో కొలువు తీరిన సువర్ణగిరి జ్వాలాలక్ష్మీనరసింహా తిరుకల్యాణ మహోత్సవాలు మార్చి14 నుంచి 19 వరకు జరగనున్నాయి. శుక్రవారం ఆలయ పూజారి పోలెబోయిన రవితేజ, ఆలయ కమిటీ సభ్యులు భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ చేతుల మీదుగా కల్యాణ మహోత్సవాల వాల్‌పోస్టల్‌ను ఆవిష్కరించారు. కల్యాణానికి రావాలని పీవో రాహుల్‌ను ఆహ్వానించారు. కార్యక్రమంలో గ్రామస్థులు గొగ్గలి రవి పాల్గొన్నారు.



విద్యార్థుల ప్రతిభను తెలుసుకుంటున్న పీఓ

ఏటీఎంలో నకిలీ నోట్లు పెట్టిన వ్యక్తి అరెస్టు

ఇల్లెందుటౌన్,ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): ఏటీఎంలో నకిలీ నోట్లు పెట్టిన వ్యక్తిని శుక్రవారం ఇల్లెందు పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇల్లెందు పట్టణంలోనే కాకతీయ నగర్‌కు చెందిన పుట్ట మల్లికార్జున్ వారం క్రితం పట్టణంలోని ఎస్బీఐ ఏటీఎంలో రూ.500 నోట్లు 10 తన ఎకౌంట్‌లోకి జమ చేశాడు. వీటిల్లో 8 నోట్లు నికిలీగా ఎస్బీఐఅధికారులు గుర్తించారు. దీంతో ఎస్బీఐ ఇల్లెందు బ్రాంచ్ అధికారులు పోలీసులకు సమాచారం అందించారు. విచారణ చేపట్టిన ఇల్లెందు పోలీసులు సీసీ టీవీ పుటేజీలు పరిశీలించారు. నోట్లు జమచేసిన పట్టు మల్లికార్జున్‌ను గుర్తించి కేసు నమోదు శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

కోర్టుహాలులో దాడికి పాల్పడిన మహిళకు జైలు

కొత్తగూడెంలీగల్,ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి):కోర్టుహాలులోకి అక్రమంగా ప్రవేశించి దాడికి పాల్పడిన మహిళకు జైలు శిక్ష విధిస్తూ కొత్తగూడెం మొదటి అదనపు జ్యూడిషల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎ.సుచరిత శుక్రవారం తీర్పు చెప్పారు. 2017 ఫిబ్రవరి 28న కొత్తగూడెం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో కేసుల కాల్ వర్క్ నిర్వహిస్తుండగా పాల్వంచ వెంకటేశ్వరకాలనీకి చెందిన కొడాలి నర్మదా కోర్టు హాలులోకి ఒకేసారి వచ్చింది. వాయిదాకు హాజరైన పాల్వంచ మండలం ఇల్లెందులపాడుకు చెందిన గుగులోత్ మాన్సింగ్‌ను కోర్టులో జడ్జి ముందే దాడి చేసింది. ఈ విషయంపై కోర్టు సూపరింటెండెంట్ రషీద్ అలీఖాన్ కొత్తగూడెం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి సబ్‌ఇన్‌స్పెక్టర్ జి.తిరుపతి కేసునమోదు చేశారు. కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. కోర్టులో ఏడుగురు సాక్షులను విచారించారు. నిందితురాలైన కొడాలి నర్మదపై నేరం రుజువు కావడంతో ఏడాదిన్నర జైలు శిక్ష, రూ.2వేలు జరిమాన విధిస్తూ తీర్పు చెప్పారు.

మునగసాగుతో మంచి ఆదాయం

అశ్వారావుపేటరూరల్, ఫిబ్రవరి21 (ఆంధ్రజ్యోతి): మునగసాగు చేయటం ద్వారా రైతులకు మంచి ఆదాయం వస్తుందని జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు అన్నారు. మండలంలోని ఆసుపాకలో మునగ తోటలను జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు శుక్రవారం పరిశీలించారు. వ్యవసాయ అధికారి మాట్లాడుతూ పామాయిల్‌లో అంతర పంటగా మునగను సాగు చేసుకోవచ్చని, తద్వారా రైతులకు అదనపు ఆదాయం వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏవో శివరాం ప్రసాద్, ఏఈవోలు రవీంద్ర, షాకీరభాను, రైతులు పాల్గొన్నారు.



టీజేఎస్ నూతన కమిటీ ఎన్నిక

ఖమ్మంచర్చికాంపౌండ్, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): తెలంగాణ జనసమితి పార్టీ జిల్లా నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్‌రావు సమక్షంలో ఈ ఎన్నికనిర్వహించారు. జిల్లా నూతన అధ్యక్షుడుగా షేక్ సర్దార్ హుస్సేన్, కార్యదర్శిగా భట్టు రాజేంద్రనాయక్‌తోపాటు ఖమ్మం నగర అధ్యక్ష, కార్యదర్శులుగా బెల్లంకొండ నాగేశ్వరరావు, షేక్ మహ్మద్‌పాషాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ పార్టీ విస్తరణకు శక్తివంచనలేకుండా కృషిచేయాలన్నారు. పార్టీ విస్తరణకు తమవంతు కృషిచేస్తామన్నారు.

మున్నేరు కలుషితం

» పెద్దతండా చెత్త నదిలోకి తరలింపు
» ప్రజల ప్రాణాలతో చెలగాటం
» పట్టించుకోని మునిసిపాలిటీ అధికారులు

ఖమ్మంరూరల్, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): డంపింగ్ యార్డుకు తరలించాల్సిన చెత్తను ఖాళీ ప్రదేశాలు, జలాశయాల్లో వేస్తూ అధికారులు కలుషితం చేస్తున్నారు. ఏదులాపురం మున్సిపాలిటి పరిధిలోని పెద్దతండా గ్రామానికి చెందిన చెత్తను మున్నేరు ఒడ్డున వేస్తుండటంతో జలాశయం కలుషితంగా మారుతోంది. ఏదులాపురం మున్సిపాలిటి పరిధిలోని పెద్దతండా చెత్తా చెదారాన్ని తరలించేందుకు మున్సిపాలిటి పరిధిలోని తెల్దారుపల్లి రెవెన్యూలో నాలుగేళ్ల క్రితమే సుమారు. రూ.6లక్షలతో ప్రభుత్వం డంపింగ్ యార్డును నిర్మించారు. పెద్ద తండా నుంచి చెత్త తరలించేందుకు రూ.20 లక్షలతో 3ట్రాక్టర్లు, 6 ఆటోలన కొనుగోలు చేయడం జరిగింది. ఈ డంపింగ్‌యార్డు నిర్మాణం చేపట్టిన కొంత కాలం వరకు అక్కడనే చెత్త పోసేవారు.

కలుషితమవుతున్న మున్నేరు.....?

ఇటీవల ప్రభుత్వం ఏదులాపురం మున్సిపాలిటిని ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో ఈ మునిసిపాలిటీ పరిధిలోని పెద్దతండాకు ఆనుకుని ఉన్న మున్నేరు నది పరివాహకం ప్రాంతంలోని పెద్ద తండా,జలగంనగర్,నాయుడుపేట, రాజీవ్ గృహకల్ప, దానవాయిగూడెం, వెంకటగిరి, గుదిమళ్ల ఉన్నాయి. ఖమ్మం పట్టణ ప్రజలకు ప్రధాన తాగునీరు మున్నేరు నీటినే తాగుతుంటారు. ఏదులాపురం మున్సిపాలిటి పరిధిలోని పెద్దతండా చెత్త వేసేందుకు డంపింగ్ యార్డును ఏర్పాటు చేసినప్పటికీ, ప్రస్తుత అధికారులు మాత్రం చెత్తను డంపింగ్ యార్డులో పోయకుండా మున్నేరు ఒడ్డున పోస్తున్నారు. పెద్దతండా, నాయుడుపేట, జలగంనగర్, తదితర కాలనీల చెత్తతో పాటు ఫంక్షన్లు, శుభకార్యాలకు తదితర వాటికి సంబంధించిన వ్యర్థాలను మున్నేరు వద్దన పోస్తున్నారు. పోసిన చెత్తను కాల్చడంతో ఆ పొగ మున్నేరు పరివాహక ప్రాంతంలోని కాలనీ వాసులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.



తాగునీరు కలుషితం

మున్నేరు ఒడ్డున పోసిన చెత్తా చెదారం అంతా మున్నేరులో కలిస్తుంది. దీంతో నీరు కలుషితమవుతుంది. నిత్యం లక్షల మంది తాగే మున్నేరు నీరు కలుషితమవుతుంటే అధికారులు పట్టించుకునే పరిస్థితి లేకుండా పోయింది.ప్రజల దాహార్తిని తీర్చి వారి ప్రాణాలను కాపాడాల్సిన అధికారులే మున్నేరులో చెత్తను పోసి కలుషితం చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతుంటే ఎవరికి చెప్పుకోవాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

డంపింగ్ యార్డు దూరం
మునిసిపల్ కమిషనర్ షఫీ ఉల్లా

పెద్దతండాకు డంపింగ్ యార్డు దూరం అయినందున చెత్తను మున్నేటి ఒడ్డున పోస్తున్నారు. వెంటనే మున్నేరు వద్దన పోయకుండా నిలిపివేస్తాం. ప్రత్యేకంగా మరోడంపింగ్ యార్డు నిర్మాణానికి భూమి కేటాయించే వరకు తెల్దారుపల్లి వద్ద నిర్మించిన డంపింగ్‌యార్డులోకే చెత్తను తరలిస్తాం.

ఎక్స్‌గ్రేషియా చెక్కు అందించిన సీపీ



బాధిత కుటుంబ సభ్యులతో సీపీ

ఖమ్మంక్రైం,ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): కొణిజర్ల పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందిన హెడ్‌కానిస్టేబుల్ లోకేష్, ఏఆర్ కానిస్టేబుల్ బాలరాజు కుటుంబసభ్యులకు భద్రతా ఎక్స్‌గ్రేషియా నుంచి మంజూరైన చెక్కులను సీపీ సునీల్‌దత్ అందజేశారు. మృతుల కుటుంబ సభ్యులకు సీపీ తన కార్యాలయంలో శుక్రవారం అందించారు. ఒక్కో కుటుంబానికి రూ.8లక్షలు మంజూరు అయ్యాయని సీపీతెలిపారు. ప్రభుత్వ పరంగా రావాల్సిన ఇతర సౌకర్యాలను అందజేస్తామని చెప్పారు.ఈకార్యక్రమంలో ఏడీసీపీ నరేష్‌కుమార్ పాల్గొన్నారు.

రుక్మారావుకి సన్మానం



సన్మానిస్తున్న ఉద్యోగులు

ఖమ్మం సంక్షేమ విభాగం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, బీసీ, గిరిజన,మైనార్టీ సంక్షేమ వసతిగృహాల్లోని ఉద్యోగుల సంక్షేమానికి సహాయం అందిస్తామని తెలంగాణ సంక్షేమాధికారుల సంఘం నూతన అధ్యక్షుడిగా మూడోసారి ఎన్నికైన కొటపాటి రుక్మారావు పేర్కొన్నారు. శుక్రవారం ఖమ్మం ఎస్సీ కాంప్లెక్స్ హాస్టల్స్ భవన సముదాయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమశాఖల ఉద్యోగులు రుక్మారావును సన్మానించారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు జీ వినోద్, శేఖర్, ఇంద్రజ, ఝాన్సీ, మున్ని, కళావతి, లక్ష్మీ, నరేశ్, ఎస్.తిరుపతిరావు, విజయ్, సేతురామ్, యాకూబ్, మాన్సింగ్, వెంకన్న పాల్గొన్నారు.

శివాలయంలో పూజలు

తిరుమలాయపాలెం,ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొక్కిరేణి శివాలయంలో శుక్రవారం గణేషుడి విగ్రహ పునఃప్రతిష్ఠ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. జల బిందెలతో జలాబిషేకం చేశారు పాలు, పంచామృతాలతో అబిషేకం చేశారు. ఈకార్యక్రమంలో కోలాట బృందం నిర్వహించిన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈకార్యక్రమంలో యలకొండ నాగేశ్వరరావు, బాలాజీరావు, పాల్గొన్నారు.

సమస్యలపై శాసనమండలిలో పోరాడుతా: అలుగుబెల్లి



మాట్లాడుతున్న నర్సిరెడ్డి

ఖమ్మంఖానాపురంహవేలి, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, అధ్యాపకుల సమస్యలపై శాసనమండలిలో, బైటా పోరాడుతానని ఉపాధ్యా ఎమ్మెల్సీ అభ్యర్థి అలుగుబబెల్లి నర్సిరెడ్డి అన్నారు.శుక్రవారం నగరంలోని యూటీఎఫ్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు.వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గానికి ఈ నెల 27న జరిగే ఎన్నికల్లో ఓటరుగా నమోదైన ఉపాధ్యాయులు, అధ్యాపకులు మొదటటి ప్రాధాన్యత వేటు వేసి గెలిపించాలని కోరారు.ఈ సమావేశంలో యూటీఎఫ్, టీపీటీఎఫ్ రాష్ట్ర నాయకులు దుర్గా భవాని, విజయ్, జిల్లా నాయకులునాగేశ్వరరావు, రంజాన్, వెంగళరావు, ఏవి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సర్వోత్తం రెడ్డిని గెలిపించాలి

ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే



కళాశాలలో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

ఖమ్మంబైపాస్‌రోడ్,ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి):బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సర్వోత్తం రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని ఉప్పల్ మాజీఎమ్మెల్యే భేతి సుభాస్‌రెడ్డి కోరారు. నగరంలోని ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కాలేజీ,ఎన్ఎస్‌పీ ప్రభుత్వ ఉన్నతపాఠశాల, అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలల్లో శుక్రవారం ప్రచారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, ఆచంటి కోటేశ్వరరావు, ఖమ్మం అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య మంద సరస్వతి, దొడ్డ అరుణ, కుమిలి శ్రీనివాస్, వెంకటనారాయణ పాల్గొన్నారు.

బీపీఈడీ కళాశాలలో జాబ్‌మేళా

ఖమ్మంఖానాపురంహవేలి, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి):నగరంలోని కాకతీయ యూనివర్శిటి ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల విద్యార్థులకు శుక్రవారం బెంగళూరుకు చెందిన ఈడెన్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. మొత్తం 20మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్ తెలిపారు. వీరికి బెంగుళూరు, హైదరాబాద్, డిల్లీ వంటి నగరాల్లో ఉపాధి అవకాశాలు కల్పించినట్లు సంస్థ నిర్వహకులు నాగబాబు, శేఖర్ డేవిడ్ తెలిపారు.

పొలాల వద్ద ఘర్షణ

బోనకల్, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): మండలంలోని రావినూతలలో పంటపొలాల వద్ద శుక్రవారం ఘర్షణ తలెత్తడంతో ఇద్దరిపై కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ కె.మధుబాబు తెలిపారు. గ్రామానికి చెందిన తాళ్లూరి రాంబాబు, గార్లపాటి కిషోర్ భూముల వద్ద నీటిని పెట్టుకునే విషయంలో వారిద్దరి ఘర్షణ చోటుచేసుకుంది. ఒకరిపై మరికొరు దాడిచేసుకున్నారు.

నాణ్యత హామీ ప్రమాణాల పరిశీలన

చింతకాని, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిన్నమండవ గ్రామంలో ఉప ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం జాతీయ నాణ్యత హామీ ప్రమాణాల పరిశీలన కార్యక్రమాన్ని ఆన్‌లైన్ ద్వారా నిర్వహించారు. ఆరోగ్య కేంద్రం ద్వారా రోగులకు అందుతున్న సేవలు, మందుల పంపిణీ, పరిసరాల పరిశుభ్రత వివరాలను ఆన్‌లైన్ ద్వారా కేంద్రం బృందం పరిశీలించింది. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో కళావతిబాయి, వైద్యులు చందునాయక్, అల్తాఫ్, సాయికుమార్, కృష్ణారావుపాల్గొన్నారు.

ఒక్కటైన ప్రేమ జంట

కామేపల్లి,ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నెమలిపురి గ్రామానికి చెందిన ఓప్రేమ జంట ఒక్కటయ్యారు. నెమలిపురి గ్రామానికి చెందిన బిందు బుధవారం అదృశ్యం అయిందని తండ్రి రవి ఫిర్యాదు ఇవ్వడంతో పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది. నెమలిపురికి చెందిన అవినాష్ ఇందు ఏడాదిగా ప్రేమించుకుంటున్నారు. ఈక్రమంలో వారు కామేపల్లి ఎస్ఐ బి. సాయికుమార్‌ను ఆశ్రయించారు. ప్రేమజంటకు కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం వారి తల్లిదండ్రుల కౌన్సిలింగ్ ఇచ్చారు. వారు అంగీకరించకపోవడంతో వారు గురువారం రాత్రి కొమ్మినేపల్లి శివాలయంలో ప్రేమ వివాహం చేసుకున్నారు.

ప్రమాదకరంగా తాళ్లచెరువు-కొక్కిరేణి రోడ్డు



తిరుమలాయపాలెం,ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొక్కిరేణి నుంచి తాళ్లచెరువు గ్రామాల మధ్య బీటీ రోడ్డు ఇటీవల కురిసిన భారీవర్షాలతో కోతకకు గురైంది.కొక్కిరేణి-ఎర్రగడ్డల మధ్య రోడ్డు సగం వరకు కోతకు గురైంది. ఆరోడ్డుపై ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం ఈరహదారిమీదుగా ద్విచక్రవాహదారులు, ఆటోల ద్వారా రాకపోకలు సాగిస్తున్నారు. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా.. ప్రమాదాలకు గురికావాల్సి దుస్థితి ఉంది.. రహదారిని బాగు చేయాలని జిల్లా అధికారులకు ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి సత్వరమే రోడ్డు మరమ్మతులు చేయాలని కోరారు.

తెలంగాణలో బీఆర్ఎస్‌ను తరిమికొట్టింది టీడీపీనే

టీడీపీ నాయకుడు కేతినేని హరీష్



మాట్లాడుతున్న కేతినేని హరీష్

ఖమ్మంమామిళ్లగూడెం, ఫిబ్రవరి21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీని తరిమికొట్టింది టీడీపీయే అని ఆ పార్టీ జిల్లా నాయకులు కేతినేని హరీష్ అన్నారు. టీడీపీ కార్యాలయంలో శుక్రవారం సమావేశంలో మాట్లాడుతూ కృష్ణా జలాల పంపిణీ విషయంలో జగదీష్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను వారు ఖండించారు. గతంలో జగన్‌తో కుమ్మక్కు ఐయి తెలంగాణకు రావాల్సిన వాటాని తాకట్టుపెట్టిందెవరో అందరికీ తెలుసన్నారు. ఇదే విషయమై బీఆర్ఎస్ పార్టీ ప్రజలలోకి పోవడానికి మొఖం చెల్లక మరోమారు తెలంగాణ వాదాన్ని రెచ్చగొడుతున్నారని అన్నారు. ఎన్నో కుయుక్తులతో చంద్రబాబుని తరిమి కొట్టాలని చూసిన బీఆర్ఎస్‌ను చిత్తుగా ఓడించిన విషయాన్ని గుర్తుచేసుకోవాలన్నారు. ప్రపంచ నాయకుడు చంద్రబాబు ఎక్కడ? మీరు ఎక్కడ? నదీ జలాలు విషయం కేంద్రమే చూసుకుంటుందన్న విషయం తెలవదా అంటూ జగదీశ్ రెడ్డిని ప్రశ్నించారు. తెలంగాణలో పటేల్ పట్వారీ వ్యవస్థను రద్దు చేసి, ప్రజాస్వామ్యాన్ని తెచ్చింది తెలుగుదేశం పార్టీ అని గతంలో బాబ్లీ ప్రాజెక్టుపై చంద్రబాబు పోరాటం చేస్తుంటే కేసీఆర్ ఏం చేసిందీ ప్రజలకు తెలుసన్నారు. గతఅసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికలలోను ప్రజలు మిమ్ముల్ని తిరస్కరించారని ఇప్పటికైనా ప్రజాభిప్రాయాన్ని గౌరవించి తెలుగుదేశం పార్టీపై అవాకులు చెవాకులు పేలడం మానాలని హితవుపలికారు. ఈ సమావేశంలో కొండబాల కరుణాకర్, మల్లెంపాటి అప్పారావు, చుండూరు రాజరాజేశ్వరి, మందపల్లి కోటేశ్వరరావు, కన్నేటిపృథ్వీ , చింతనిప్పు నాగేశ్వరరావు, చావారామారావు , నల్లమల రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో సర్వజ్ఞ విద్యార్థుల ప్రతిభ



ఖమ్మంఖానాపురం, హవేలి ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): నగరంలోని సర్వజ్ఞ పాఠశాల విద్యార్థులు టీఈ ఓఎఫ్ ఇండియన్ బ్రిలియంట్ ఒలింపియాడ్ వారు నిర్వహించిన పరీక్షల్లో ప్రతిభ చూపారు. పాఠశాలకు చెందిన 3వతరగతి విద్యార్థికే జయదేవ్ చౌహాన్ జిల్లా ప్రథమంలో, 6వ తరగతి విద్యార్థి ఎమ్ అక్షయ్ రుత్విక్ రాష్ట్ర ప్రథమ స్థానంలో నిలిచారని పాఠశాల డైరెక్టర్లు ఆర్‌వి నాగేంద్రకుమార్, నీలిమలు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

సైన్స్ మాసోత్సవాల్లో న్యూవిజన్‌కు బహుమతులు



ఖమ్మంఖానాపురంహవేలి, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): మంచికంటి భవన్‌లో విజ్ఞానదర్శిని ఖమ్మం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సైన్స్ మాసోత్సవాల్లో పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు బహుమతులు సాధించారని న్యూవిజన్ పాఠశాల ప్రిన్సిపాల్ అబాద్ అలీ తెలిపారు. బహుమతులు సాధించిన విద్యార్థులు నయశ్రీ, ఎండి రిజ్వాన్ అహ్మద్, డి నిఖిల్, ఎం మనస్వీ, యం నిదాపిర్దోస్‌ను విద్యాసంస్థల అకాడమిక్ డైరెక్టర్ సిహెచ్ కార్తీక్ అభినందించారు.

జాతీయ అథ్లెటిక్స్‌లో నగర క్రీడాకారిణి ప్రతిభ



మైథిలిని అభినందిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మంస్పోర్ట్స్,ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): ఈనెల8 నుంచి 12 వరకు ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని డెహ్రాడూన్‌లో జరిగిన 38వ జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో నగరానికి చెందిన ఎ. మైథిలి కాంస్య పతకం సాధించింది. నిత్యం సర్దార్ పటేల్ స్టేడియంలో సాధన చేసే ఆమె గతంలో సైతం రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. జాతీయస్థాయిలో స్వర్ణ, 2 రజత, 3 కాంస్య పతకాలు సాధించారు. ప్రతిభ చూపి పతకాలు సాధిస్తున్న ఆమెను శుక్రవారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అభినందించారు. జాతీయ,ఏషియన్, అంతర్జాతీయ పోటీలకు సన్నద్ధం కావాలని అందుకు కావలసిన ఆర్థిక సాయం అందిస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో సునిల్ రెడ్డి,అథ్లెటిక్ సంఘం జిల్లా కార్యధర్శి షఫీక్ అహ్మద్ ఉన్నారు.

యువకుడిపై హిజ్రా దాడి

తీవ్ర గాయాలు, పరిస్థితి విషమం

ఖమ్మంరూరల్,ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి):యువకుడిపై హిజ్రాలు కత్తితో దాడి చేశారు. ఈ సంఘటన ఏదులాపురం మునిసిపాలిటి పరిధిలోని పెద్దతండాలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. పెద్దతండా గ్రామానికి చెందిన ఓయువకుడు అదేగ్రామంలోని చికెన్ షాపులో పనిచేస్తుంటాడు. ఆ యువకుడు ఏపీకి చెందిన ఓ హిజ్రాతో కొంతకాలం ప్రేమవ్యవహారం కొనసాగించాడు. ఈక్రమంలో కొద్దిరోజులుగా హిజ్రాను పట్టించుకోవడం లేదు. గ్రామానికి వచ్చి శుక్రవారంరాత్రి చికెన్ షాపులో ఉన్న యువకుడిపై కత్తితో దాడి చేసింది. దీంతో యువకుడికి తీవ్ర గాయాలవటంతో స్థానికులు ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. యువకుడి పరిస్థితి విషమించడంతో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించినట్లు తెలిసింది. ఈ ఘటనలో మరి కొందరు హిజ్రాలు పాల్గొన్నట్లు సమాచారం. యువకుడిపై దాడిచేసిన హిజ్రాలను గుర్తించి పోలీసులు అరెస్టు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



సమావేశంలో మాట్లాడుతున్న బాగం

సంక్షోభంలోకి వ్యవసాయ రంగం

» సీపీఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంతరావు

ఖమ్మంరూరల్, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): పాలకులు కార్పోరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెడుతున్నారని సీపీఐ జాతీయ సమితిసభ్యుడు బాగం హేమంతరావు అన్నారు. మండల పరిదిలోని ఆరెకోడు గ్రామంలో జరిగిన రాష్ట్ర రైతు సంఘం మూడో మహా సభను శుక్రవారం నిర్వహించారు. ప్రధానిగా మోడీ బాధ్యతలు చేపట్టిన నాటి నుండి రైతుల గోస వర్ణనాతీతంగా మారిందన్నారు. కార్పోరేట్ శక్తులకు అంబానీ, ఆదానీలకు దేశ సంపదను దోచిపెడుతున్నారని దుయ్యబట్టారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలను కల్పించాలని స్వామినాథం చేసిన సిఫారుసులను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల హక్కులు ప్రాజెక్టులు సీపీఐ అనుబంధ సంఘమైన ఏఐకేఎస్ పోరాట ఫలితంగానే వచ్చాయన్నారు. అనంతరం 21 మందితో రైతు సంఘం మండల నూతన కమిటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, జిల్లా సహయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మిడకంటి వెంకటరెడ్డి, రైతు సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి గోవిందరావు, మండల కార్యదర్శి సుధాకర్, నాయకులు రాంమూర్తి, శ్రీనాధ్‌రెడ్డి, కిరణ్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఖమ్మంలో విద్యుత్ కోత

ఖమ్మం సంక్షేమ విభాగం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంనగరంలోని బల్లేపల్లి విద్యుత్ ఫీడర్‌లో విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఏడీఈ సంజీవ్ తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు బల్లేపల్లి, జయనగర్ కాలనీ,బాలపేట, హరితగార్డెన్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

సాగు నీరందించాలి

చింతకాని,ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ప్రతీఎకరాకు సాగర్ ద్వారా సాగు నీరందించాలని ఇరిగేషన్ డీఈ రాంప్రసాద్ అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో సాగర్ నీటి సరఫరాపై అధికారుల సమావేశం నిర్వహించారు.

మంత్రి పొంగులేటి రియల్ ఎస్టేట్‌కు జీవం పోశారు..

» ఖమ్మం బిల్డర్స్, రియల్ ఎస్టేట్ అసోషియేషన్ సభ్యులు

ఖమ్మంరూరల్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో కుదేలైన రియల్ ఎస్టేట్‌కు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జీవం పోశారని ఖమ్మం బిల్డర్స్ రియల్ ఎస్టేట్ అసోషియేషన్ గౌరవ అధ్యక్షులు గరికపాటి ఆంజనేయప్రసాద్, అధ్యక్షులు కృష్ణమోహన్ తెలిపారు. ఏదులాపురం మున్సిపాలిటి పరిదిలోని టీసీవీరెడ్డి ఫంక్షన్‌హాల్లో శుక్రవారం మంత్రి పొంగులేటి చిత్ర పటానికి క్షీరాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 25శాతం రిబేటుతో రెగ్యూలర్ చేసుకొవడానికి అవకాశం కల్పించటంతో రియల్ ఎస్టేట్ రంగానిక జీవం పోసినట్లు అయిందని తెలిపారు. డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈకార్యక్రమంలో రియల్ వ్యాపారులు మన్నేటి నాగేశ్వరరావు, జూలకంటి శ్రీనివాస్‌రావు, మధవరెడ్డి, నవీన్, కిషోర్ రెడ్డి, ఖలీల్, కిషోర్ పాల్గొన్నారు.

ఖమ్మంఖానాపురంహవేలి:ల్యాండ్ రెగ్యులేషన్ పథకం ప్రకటించడం హర్షణీయమని బాలాజీ ఎస్టేట్ అధినేత వత్సవాయి రవి అన్నారు. శుక్రవారం నగరంలోని ఆయన కార్యాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల, పొంగులేటిలకు ధన్యవాదాలు తెలిపారు. వారి చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గోసు మధు, రవికుమార్ పాల్గొన్నారు.



క్షీరాభిషేకం చేస్తున్న వత్సవాయి రవి

వ్యవసాయకూలీలకు జీవనభృతి ఇవ్వాలి

ఏఐపీకేఎంఎస్ జిల్లాకార్యదర్శి

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): వ్యవసాయకూలీలకు రూ.12 వేలు జీవనభృతి ఇవ్వాలని ఏఐపీకేఎంఎస్ జిల్లాకార్యదర్శి తిమ్మిడి హనుమంతరావు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలని పిండిప్రోలులో రాయల వెంకటనారాయణ స్మారకభవనంలో సంఘం పాలేరు డివిజన్ కమిటీసమావేశం ఎస్‌వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిది. బీఆర్ఎస్‌పాలనలో పేదలకు ఒరిగిదేమిలేదన్నారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే బాటలో పయనిస్తుందన్నారు. దేశంలో 14కోట్ల మంది వ్యవసాయకూలీలకు బీజేపీపాలనలో కూడా ప్రయోజనం లేకుండాపోయిందన్నారు. వ్యవసాయకూలీ లసమస్యలపై పోరాటాలు చేస్తామన్నారు. ఈసమావేశంలో రెంటాల యాదగిరి, చుంచువెంకన్న, భిక్షం, యోహాన్ పాల్గొన్నారు.



వేసవిలో విద్యుత్ అంతరాయం తలెత్తొద్దు: డీఈఈ

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): వచ్చే వేసవి సీజన్‌లో ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తూ ఎలాంటి అంతరాయం తలెత్తకుండా సరఫరా చేయాలని విద్యుత్ శాఖ డీఈఈ ఎల్.రాములు సిబ్బందిని ఆదేశించారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా శుక్రవారం మండలంలోని 33/11 కేవీ బుగ్గపాడు, నాగుపల్లి సబ్ స్టేషన్లను సందర్శించారు. అనంతరం ఈ సబ్ స్టేషన్ల మధ్య 2.2కేఎం 11కేవీఆ లింగ్‌లైన్‌ను చార్జ్ చేశారు. ఈ లింక్ లైన్ వలన రిజర్వు ఫారెస్ట్ ఏరియా గుండా వెళ్తున్న 11కేవీ రేగళ్లపాడు లైన్, బుగ్గపాడు నుంచి వెళ్తున్న 11కేవీఆ బుగ్గపాడు లైన్లకు ప్రత్యామ్నాయ లైన్‌గా ఈ లింక్ లైన్ చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

వకుళ మాత స్టేడియం.. ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న తుళ్లూరి దంపతులు

ఎర్రుపాలెం, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): జమలాపురం ఆలయంలో వకుళమాత స్టేడియం ప్రారంభోత్సవ ఆహ్వాన పత్రికలను శుక్రవారం ఆవిష్కరించారు. శ్రీ వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణంను భక్తులు వీక్షించేందుకు సౌకర్యంగా ఖమ్మం నగరానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త తుళ్లూరి కోటేశ్వరరావు, నిర్మల కుమారి దంపతులు భారీవ్యయంతో వకుళమాత స్టేడియాన్ని నిర్మించారు. వచ్చేనెల మార్చి 7న కార్యక్రమాలు ప్రారంభిస్తున్నట్టు దాత తుళ్లూరి కోటేశ్వరరావు తెలిపారు. అదేరోజు మండపానికి శిఖరప్రతిష్ట జరుగుతుందని అనంతరం మండపంలో మొట్టమొదటి శ్రీవారి కల్యాణం జరుగుతుందన్నారు. జమలాపురం పరిసర ప్రాంత ప్రజలతో పాటు జిల్లా వ్యాప్తంగా సుమారు 50వేల మంది భక్తులు హాజరయ్యేలా, భక్తులకు అసౌకర్యం కలగకుండా దేవాదాయశాఖతో పాటు తాము అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. భక్తులు అధికసంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు.

గణితంలో జిల్లా టాపర్‌గా మోక్షిత్ నాయక్



తల్లాడ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం రంగంబంజరకు చెందిన విద్యార్థి ధర్మసోత్ మోక్షిత్‌నాయక్ గణితంలో జిల్లా టాపర్‌గా నిలిచాడు. ఇటీవల ఖమ్మంలో నిర్వహించిన ఇండియన్ బ్రిలియంట్ ఒలింపియాడ్ గణితం పరీక్షల్లో మోక్షిత్‌నాయక్ 40మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచాడు. మోక్షిత్‌నాయక్ ప్రస్తుతం కల్లూరులోని ఓ ప్రైవేట్ స్కూల్లో నాల్గోతరగతి చదువుతున్నాడు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సమస్యల తిష్ఠ

ఆంధ్రజ్యోతి విజిట్



మరమ్మతులు చేపట్టాల్సిన ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం

» మరమ్మతులకు నిధుల కోసం నిరీక్షణ
» వసతులు కల్పించాలని తల్లిదండ్రులు వేడుకోలు

బోనకల్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): బోనకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏళ్ల తరబడి తిష్ఠ వేసిన సమస్యలతో ఇబ్బందులు తప్పడం లేదు. కళాశాలను ఆంధ్రజ్యోతి శుక్రవారం సందర్శించగా పలు సమస్యలు కనిపించాయి. కళాశాలలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ 100, సెంకడ్ ఇయర్‌లో 85 మంది విద్యార్థులు చదువుతుండగా, 11 మంది అధ్యాపకులు ఉన్నారు. మొత్తం 16 గదులు ఉండగా, గతంలో నిర్మించిన పాత భవనంలోని పది గదులు శిథిలావస్థకు చేరాయి. పాత భవనం రంగులు లేక గోదాం లాగా కనిపిస్తోంది. లోపల ఫ్లోరింగ్, మెట్లు పూర్తిగా కుంగిపోయాయి. కిటికీలకు తలుపులు లేక పోవడంతో పాటు అవి కిందపడే స్థితిలో ఉన్నాయి.

ప్రహరీ లేకపోవడంతో రోడ్ల పై వెళ్లే వాహనాల శబ్దాలకు బోధన పై విద్యార్థులు పూర్తిస్థాయిలో దృష్టి పెట్టే అవకాశం ఉండటం లేదు. విద్యార్థులకు సంబంధించి ఒక బ్లాక్ టాయ్‌లెట్లకు నీటి సౌకర్యం లేదు. ప్రహరి లేక పోవడం వలన బయట నుంచి వస్తున్న ఆకతాయిలు టాయ్‌లెట్లను ధ్వంసం చేస్తున్నారు. కొత్త భవనంలోని తరగతి గదుల ఫ్లోరింగ్ దెబ్బతినడంతో పాటు మెట్ల వద్ద కంకర పూర్తిగా బయట పడటంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. మరుగుదొడ్లను శుభ్రం చేసేందుకు స్వీపర్ లేక పోవడంతో వాటి నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది.

ప్రభుత్వ కళాశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడం కోసం అధికారులు అన్ని తరగతి గదులను పరిశీలించి ప్రభుత్వానికి అంచనాలను పంపారు. మేజర్, మైనర్ మరమ్మతుల నిర్వహణకు గానూ రూ. 80 లక్షల నిధులను అంచనాలు వేసి ప్రభుత్వానికి పంపారు. నిధుల మంజూరి కోసం నిరీక్షిస్తున్నారు. త్వరితగతిన నిధులను మంజూరు చేస్తే వేసవి సెలవుల్లో నైనా పనులు పూర్తి చేసే అవకాశం ఉంటుంది. కొత్త విద్యా సంవత్సరానికి ఇబ్బందులు లేని చదువులు కొనసాగుతాయన్న భావన వ్యక్తం అవుతోంది.

అన్ని వసతులను కల్పించాలి
యార్లగడ్డ చిన్నశ్రీను, విద్యార్థిని తండ్రి,

కళాశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, అన్ని వసతులను కల్పించాలి. ప్రహరి గోడ లేక పోవడం విద్యార్థులకు ఇబ్బందిగా మారింది. చదువుల్లో రాణిస్తున్న విద్యార్థుల సమస్యలను పరిష్కరిస్తే ఇంకా బాగుంటుంది. మరమ్మత్తులు నిర్వహించి కళాశాల పాత భవనానికి రంగులు వేయించాలి. కార్పొరేట్ కళాశాలలకు దీటుగా తీర్చిదిద్దాలి.

మహా శివరాత్రికి 75 ప్రత్యేక బస్సులు: ఆర్ఎం

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా శైవక్షేత్రాల సందర్శనార్థం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 75ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు ఖమ్మం ఆర్టీసీ ఆర్ఎం ఏ.సరిరాం తెలిపారు. శుక్రవారం ఆయన సత్తుపల్లి ఆర్టీసీ డిపో గ్యారేజీలో విలేకరులతో మాట్లాడుతూ ఖమ్మం నుంచి తీర్థాలకు 25, సత్తుపల్లి నుంచి నీలాద్రికి 25, వైరా నుంచి స్నానాల లక్ష్మీపురానికి 10, కొత్తగూడెం నుంచి నీలాద్రి, బెండాలపాడు, అన్నపురెడ్డిపల్లికి 10, భద్రాచలం నుంచి మోతేగడ్డ పుణ్యక్షేత్రాలకు ఐదు చొప్పున మొత్తం 75బస్సులు నడిపించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

జాతీయ నాణ్యత హామీ ప్రమాణాల పరిశీలన

చింతకాని, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిన్నమండవ గ్రామంలో ఉప ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం జాతీయ నాణ్యత హామీ ప్రమాణాల పరిశీలన కార్యక్రమాన్ని ఆన్‌లైన్ ద్వారా నిర్వహించారు. ఆరోగ్య కేంద్రం ద్వారా రోగులకు అందుతున్న సేవలు, మందుల పంపిణీ, పరిసరాల పరిశుభ్రత వివరాలను ఆన్‌లైన్ ద్వారా కేంద్రం బృందం పరిశీలించింది. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో కళావతిబాయి, వైద్యులు చందునాయక్, అల్తాఫ్, సాయికుమార్, కృష్ణారావు, పుష్పలత, సిబ్బంది పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

ఏన్కూరు, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): వేసవిలో వన్యప్రాణాలు సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్టు అటవీశాఖ ఎఫ్‌డీవో మంజుల తెలిపారు. శుక్రవారం ఏన్కూరు వెదురు డిపో వేలంపాట నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వెదురు డిపో ద్వారా ప్రతి ఏడాది ప్రభుత్వానికి రూ.5లక్షల ఆదాయం వస్తుందన్నారు. వన్యప్రాణుల దాహార్తిని తీర్చేందుకు సోలార్ నీటి పంపులను ఏర్పాటుచేసినట్టు తెలిపారు. వన్యప్రాణుల వివరాలు తెలుసుకునేందకు సీసీకెమేరాలు ఏర్పాటుచేసినట్టు తెలిపారు.

టీజేఎస్ జిల్లా అధ్యక్షుడిగా సర్దార్ హుస్సేన్



బోనకల్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని ఆళ్లపాడు గ్రామానికి చెందిన షేక్ సర్దార్ హుస్సేన్ ఎన్నికయ్యారు. ఖమ్మంలో జరిగిన ఆ పార్టీ సమావేశంలో శుక్రవారం టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్రావు సమక్షంలో ఏకగ్రీవంగా జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సర్దార్ మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమం కోసం, అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కొరకు అంకితభావంతో పని చేస్తానని స్పష్టం చేశారు.

రాష్ట్రంలో ఏ ఎన్నికలు వచ్చినా బీజేపీదే గెలుపు

» బీజేపీ సీనియర్ నాయకుడు పొంగులేటి సుధాకర్ రెడ్డి



ఐక్యత చాటుతున్న బీజేపీ నాయకులు

వైరా/ తల్లాడ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఏ ఎన్నిక జరిగినా బీజేపీదే గెలుపని ఆపార్టీ సీనియర్ నాయకుడు పొంగులేటి సుధాకరరెడ్డి పేర్కొన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి పులి సరోత్తం రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ శుక్రవారం వైరాలో జరిగిన ప్రచార సమావేశంలో ఆయన మాట్లాడారు. 420హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. ఈ 16నెలల కాలంలో హామీల అమలులో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందని ఆక్షేపించారు. ప్రజలు కాంగ్రెస్‌పై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, ఏ ఎన్నిక జరిగినా కర్రు కాల్చి ఓటుఅనే ఆయుధం ద్వారా వాత పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎమ్మెల్సీగా సరోత్తం రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు ఈవీ రమేష్, వాకదాని పుల్లారావు యాదవ్, సన్నే ఉదయ్‌ప్రతాప్, కొప్పూరి నాగేశ్వరరావు, నున్నా రవికుమార్, నంబూరి రామలింగేశ్వరరావు, గుత్తా వెంకటేశ్వరరావు, నెల్లూరి కోటేశ్వరరావు, మనుబోలు వెంకటకృష్ణ, కోసూరి గోపాలకృష్ణ పాల్గొన్నారు. రైతు సమస్యలు పరిష్కారానికై రాష్ట్ర ప్రభుత్వంపై వత్తిడి తీసుకురావాలని కోరుతూ బీజేపీ జాతీయ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డికి శుక్రవారం తల్లాడలో బీజేపీ నాయకులు స్థానిక రైతులతో కలిసి వినతిపత్రం సమర్పించారు.

ప్రతి ఎకరాకు నీరందించాలి

చింతకాని, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ప్రతి ఎకరాకు సాగర్ ద్వారా సాగు నీరందించాలని ఇరిగేషన్ డీఈ రాంప్రసాద్ అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో సాగర్ నీటి సరఫరాపై అధికారుల సమావేశం నిర్వహించారు. సాగునీటి పంపిణీ కోసం ఇరిగేషన్, వ్యవసాయ, రెవెన్యూ అధికారులతో మండల కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చివరి పంట భూములకు రానున్న రోజుల్లో నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

రేపు సీతారాముల కల్యాణం

వైరా, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): వైరా రిజర్వాయర్ అలుగుల సమీపంలోని శ్రీదాసాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం సీతారామచంద్రుల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తామని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఆదివారం కల్యాణం అనంతరం మహా అన్నదానాన్ని ఏర్పాటుచేశామని తెలిపారు.

అభ్యుదయ భావాలు ఆచరణీయం

బోనకల్, ఫిబ్రవరి, 21(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు ఏడునూతల సీతమ్మ అభ్యుదయ భావాలు ఆచరణీయమని సీపీఎం మాజీ రాష్ట్ర నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, మన్నెపల్లి సుబ్బారావు కొనియాడారు. మండలంలోని గోవిందాపురం(ఎల్)లో శుక్రవారం సీతమ్మ దశదిన కర్మ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గిరిజనుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

» సంత్‌సేవాలాల్ జయంతి ఉత్సవాల్లో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్



ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌ను సన్మానిస్తున్న గిరిజనులు

కొణిజర్ల, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): గిరిజనుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అమ్మపాలెం గ్రామంలో నిర్వహించిన సంత్‌సేవాలాల్ జయంతి ఉత్సావాల్లో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌తో పాటు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పూజాకార్యక్రమంలో పాల్గొని పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ గిరిజనులంతా ఐక్యంగా ఉంటూ విద్యాపరంగా అభివృద్ధి చెందినప్పుడే అన్ని రంగాల్లో కూడా అభివృద్ధి చెందుతారన్నారు. గిరిజనుల సంస్కృతి సంప్రదాయాలకు నిలువుటద్దం సంత్‌సేవాలాల్ జీవితం అని, సేవాలాల్ జీవితం ఆదర్శప్రాయన్నారు. సేవాలాల్ జయంతిని ప్రతి గిరిజన తండాలో నిర్వహించుకోవాలని తెలిపారు. సేవాలాల్ ఆలయాల అభివృద్ధి గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతానని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వడ్డే నారాయణరావు, జిల్లా నాయకులు సూరంపల్లి రామారావు, కోసూరి శ్రీను, సిద్దు, గాలీబ్‌పాషా, బానోతు అనూష, షేక్ మాస్తాన్, మూడు సురేష్, బానోతు నాగేశ్వరరావు, నరసింహరావు, గిరిజన సంఘం నేత భూక్యా వీరభద్రం, తాతా సుధాకర్, కుంచపు రాంబాబు పాల్గొన్నారు.

పొలాల వద్ద ఘర్షణ

బోనకల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రావినూతల గ్రామంలో పంట పొలాల వద్ద శుక్రవారం ఘర్షణ తలెత్తడంతో ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ కె.మధుబాబు తెలిపారు. గ్రామానికి చెందిన తాళ్లూరి రాంబాబు, గార్లపాటి కిషోర్ తమ భూముల వద్ద నీటిని పెట్టుకునే విషయంలో వారిద్దరి ఘర్షణ చోటుచేసుకుంది. ఒకరిపై మరికొరు దాడి చేసుకున్నారు.

మద్దతు ధర చెల్లించాలి

చింతకాని, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మిర్చి రైతులకు ప్రభుత్వం క్వింటాకు రూ 25 వేల మద్దతు ధర చెల్లించాలని సీపీఎం మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు.

సాగునీటిపై సమీక్ష

వైరా, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): వైరా రిజర్వాయర్, ఎన్నెస్పీ ఆయకట్టులో రబీలో సాగునీటి సరఫరాపై శుక్రవారం ప్రభుత్వశాఖల సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. తహసీల్దార్ కేవీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈసమావేశం నిర్వహించారు. నీటిపారుదల, వ్యవసాయ, ట్రాన్స్‌కో అధికారులతో ఈ సమన్వయ సమావేశం జరిగింది. ఆయకట్టు చివరి భూములకు ఎలాంటి ఎద్దడి లేకుండా సాగునీటిని సరఫరా చేయాలని సమావేశంలో నిర్ణయించారు.

'కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తున్న ప్రభుత్వం'

బోనకల్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ సంస్థలకు బీజేపీ ప్రభుత్వం కొమ్ము కాస్తుందని సీపీఎం డివిజన్ కమిటీ సభ్యుడు పాపినేని రామనర్సయ్య ఆరోపించారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడుతూ మతోన్మాద పార్టీలను ఎదుర్కోవాలంటే కమ్యూనిస్టులకు మాత్రమే సాధ్యమన్నారు. ప్రజా సమస్యలకు పోరాటాలే శరణ్యమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, తెల్లాకుల శ్రీనివాసరావు, దొండపాటి నాగేశ్వరరావు, కిలారు సురేష్ తదితరులు పాల్గొన్నారు

అమానవీయ పెట్టుబడిదారి వ్యవస్థకు ప్రత్యామ్నాయమే సోషలిజం

కొణిజర్ల, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): అమానవీయ పెట్టుబడిదారి వ్యవస్థకు ప్రత్యామ్నాయం సోషలిస్టు వ్యవస్థయేనని సీపీఎం జిల్లా నాయకులు బండారు రమేష్, తాళ్లపల్లి కృష్ణ తెలిపారు. కొణిజర్లలోని సంక్రాంతి రామచంద్రయ్య భవనంలో శుక్రవారం జరిగిన రెడ్ బుక్స్ డే కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా ఆర్థికమాంద్యం ముంచుకొస్తుందని, అనేక దేశాలులోని ఆర్థిక వ్యవస్థలు వృద్ధిని సాధించలేక ఇబ్బందిపడుతున్నాయని అన్నారు. ధరల పెరుగుదలకు, నిరుద్యోగం పెరుగుదలకు పెట్టుబడిదారి వ్యవస్థనే బాధ్యత వహించాలని తెలిపారు. సీపీఎం మండల కార్యదర్శి చెరుకుమల్లి కుటుంబరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు మోత్కూరు వెంకటేశ్వరరావు, బోయినపల్లి శ్రీనివాసరావు, చింతపల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

వైభవంగా దేవతామూర్తుల ఊరేగింపు



కోలాటం వేస్తున్న మహిళలు

తల్లాడ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం పినపాక గ్రామంలో శుక్రవారం దేవతామూర్తుల ఊరేగింపు వైభవంగా జరిగింది. సోమలింగేశ్వరస్వామివారి దేవాలయ ప్రతిష్ఠా మహోత్సవం సందర్భంగా ఊరేగింపు నిర్వహించారు. ముందుగా ఆచార్యులు గోవిందశర్మ, వేదపండితులు మురళీధరశర్మ ఆధ్వర్యంలో శాంతిపాఠం, గోపూజ, ధ్వజారోహణం, మహగణపతిపూజ, అఖండ దీపారాధన, యాగశాల ప్రవేశం, నవగ్రహ, వాస్తు, దేవతాస్థాపన పూజలు నిర్వహించారు. ఊరేగింపులో మహిళలు కోలాట నృత్యాన్ని ప్రదర్శించారు.

యుద్ధప్రాతిపదికన వంద పడకల ఆస్పత్రి నిర్మాణం

» పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్

వైరా, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): వైరా నియోజకవర్గ ప్రజల చిరకాల వాంఛ అయిన వందపడకల ఆసుపత్రి నిర్మాణాన్ని యుద్ధప్రాతిపదికన చేస్తున్నామని ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ పేర్కొన్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌తో కలిసి శుక్రవారం వందపడకల ఆసుపత్రి పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధ్యమైనంత తొందర్లోనే ఆసుపత్రి నిర్మాణాన్ని పూర్తిచేసి ప్రజలకు వైద్యసేవలందించేందుకు కృషిచేస్తున్నామని తెలిపారు. స్నానాల లక్ష్మీపురంలోని శివరాత్రి జాతర ఏర్పాట్లను కూడా పరిశీలించారు. వైరా, కొణిజర్ల మండలాల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, వడ్డే నారాయణ, ఏదునూరి సీతారాములు, నాయకులు పొదిల హరినాథ్, పమ్మి అశోక్, మట్టూరి కృష్ణారావు, దరావత్ శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

ఘనంగా మాతృభాషా దినోత్సవం



జ్యోతిప్రజ్వలన చేస్తున్న కరస్పాండెంట్ కిరణ్

చింతకాని, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నాగులవంచ గ్రామంలోని శ్రీ ఆదర్శ విద్యాలయంలో మాతృభాషా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సందర్భంగా మాతృభాషా నేర్చుకోవడం వలన కలుగు ప్రయోజనాన్ని విద్యార్థులకు పాఠశాల కరస్పాండెంట్ బోడెపూడి కిరణ్ విద్యార్థులకు వివరించారు. అనంతరం సరస్వతిదేవి చిత్రపటానికి పూలమలలు వేసి పూజలు చేశారు. విద్యార్థులకు కఠిన పదాల డిక్టేషన్, మంచి దస్తూరి, చిత్రలేఖనం, మాతృభాష ఆవశ్యకత అనే అంశంపై వ్యాసరచన, పద్యాలు రాగ, భావ యుక్తంగా ఆలపించడం, తెలుగు వారందరం తెలుగులోనే మాట్లాడదాం, కథ చెప్పటం అనే అంశాలపై ప్రతిభ పోటీ నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ చావా అరుణ్‌కుమార్, తెలుగు ఉపాధ్యాయురాలు బోళ్ల రేణుక, వినీల, శ్రీనివాసరావు, గోపిచందర్, పార్వతి, త్రివేణి, సుజిత పాల్గొన్నారు.

క్వింటాలు మిర్చికి రూ.25వేలు చెల్లించాలి

కారేపల్లి, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): మిర్చిపంటకు ధర లభించక పోవడంతో రైతులు నష్టపోతున్నారని, ప్రభుత్వం క్వింటా మిర్చికి రూ25వేల ధర కల్పించాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా సహాయకార్యదర్శి పోలారి శ్రీనివాస్‌రావు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిధిలోని గేటుకారేపల్లిలో మిర్చికల్లాలను నాయకులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో భూక్య శివానాయక్, మహమ్మద్ యాకుబ్, దంతాల నారాయణ, సుంకర బుజ్జయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్‌లో గరికపాడు విద్యార్థుల ప్రతిభ

వైరా, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గరికపాడు హైస్కూల్ విద్యార్థులు జాతీయ ప్రతిభా పరీక్ష(ఎన్ఎంఎంఎస్)లో ప్రతిభను చాటుకున్నారు. 8వతరగతి విద్యార్థిని డోలు నిహారిక జిల్లాస్థాయిలో ఐదోస్థానంలో నిలిచింది. బాణాల ఉషారాణి, శృతి, వేమిరెడ్డి ఉష, ముత్తమాల శరత్‌చంద్ర, గరిడేపల్లి ఫణీంద్ర మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. విద్యార్థులను హెచ్ఎం దొంతెబోయిన సత్యనారాయణ, జీవశాస్త్ర ఉపాధ్యాయుడు యాకూబ్, ఉపాధ్యాయులు అభినందించారు.

నాగార్జున సాగర్ నీటి వాటాను వాడుకోవటంలో ప్రభుత్వం విఫలం

» బీఆర్ఎస్ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జి, జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న కమల్‌రాజు

చింతకాని, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ నీటి వాటాను వాడుకోవటంలో ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జి, జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు అన్నారు. శుక్రవారం చింతకాని మండల లచ్చగూడెం గ్రామంలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు నెర్సుల యల్లయ్య కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. అనంతరం స్థానిక నాయకులు, రైతులతో వెళ్లి నీళ్ల లేక ఎండిపోతున్న కౌలు రైతు పొలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతకాని మేజర్‌కు 130 క్యూసెక్కుల నీరు రావాల్సి ఉండగా కేవలం 70 క్యూసెక్కులు, బీబీసీ కాలువకు 1200 క్యూసెక్కుల నీరు ఇవ్వాల్సి ఉండగా 700 క్యూసెక్కుల నీరు మాత్రమే విడుదల చేస్తుండటంతో చివరి భూములకు సాగు నీరు సరిగా అందక పంట పొలాలు ఎండిపోతున్నాయన్నారు. చనిపోయిన రైతు కుటుంబానికి రూ. 20 లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య, మంకెన రమేష్, బొడ్డు వెంకటరామారావు, గురిజాల హనుమంతరావు, శ్రీను, కృష్ణయ్య, కొమ్ము ముక్కంటి, మేకపోతుల సైదేశ్వరరావు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి చర్యలు..

ఏన్కూరు, ఫిబ్రవరి21 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతంలోని రోడ్ల నిర్మాణానికి జాతీయ ఎస్టీ కమిషన్ సిఫార్సుమేరకు చర్యలు చేపడుతున్నారు. దీనికి సంబంధించిన వివరాలును శుక్రవారం మాజీ ఆరెం వరలక్ష్మి విలేకరులకు తెలిపారు. తన పదవీకాలంలో ఏన్కూరు నుంచి కొత్తమేడేపల్లి, ఒంటిగుడిసె నుంచి నాచారం, గంగులనాచా రం నుండి సూరారాం, తిమ్మరావుపేట నుండి ఉప్పలచలక, తూతకలింగన్నపేట నుండి భగవాననాయక్‌తండా తదితర లింక్‌రోడ్లను నిర్మించాలని అనేకసార్లు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిన గిరిజనులు పట్ల నిర్లక్ష్యంతో నిధులు మంజూరు చేయలేదని అన్నారు. దీంతో విసిగి వేసారి గతేడాది అక్టోబరు 10న జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదుచేశానని తెలిపారు. త్వరలోనే లింక్ రోడ్ల నిర్మాణం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

టాలెంట్ టెస్ట్‌లో 'ఎన్టీఆర్‌నగర్' విద్యార్థుల ప్రతిభ

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి21 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి మండల స్థాయిలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్, క్విజ్ పోటీల్లో ఎన్టీఆర్ నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు విజయదుందుబి మ్రోగించారు. పాల్గొన్న ప్రతి విద్యార్థి బహుమతి సాధించడంతో విద్యార్థుల్లో ఉత్సాహం రెట్టింపైంది. సత్తుపల్లి మండలంలో 60కి పైగా ప్రాథమిక పాఠశాలల విద్యార్థులతో పోటీపడి 4బహుమతులతో పాటు రూ.4వేల క్యాష్ అవార్డు కూడా గెలుచుకుని మండలంలో ప్రథమ స్థానంలో నిలిచింది. పాఠశాలకు విద్యార్థులు యనమాల కార్తీక, హేమచంద్, గణేష్‌మూర్తి టీమ్ క్విజ్ పోటీలో ప్రథమ స్థానం సాధించగా టాలెంట్ టెస్ట్‌లో గణేష్ మూర్తి ప్రథమ స్థానం, సుమంత్, ఎస్‌కే. నిహాల్ తృతీయ స్థానం సాధించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను హెచ్ఎం సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు లాల్‌అహ్మద్, శేషుకుమార్, నర్సింహారావు, వెంకటేష్, విజయ, తల్లిదండ్రులు అభినందించారు.